


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## భళా.. భారత్!

- ఆర్థిక వ్యవస్థ ప్రగతిపై సీఎం చంద్రబాబు

4



## ఇక మలివిడత భూ సమీకరణ

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మంత్రిమండలి
- 16.6వేల ఎకరాల సమీకరణకు నిర్ణయం
- 7గ్రామాల పరిధిలో చేపట్టేందుకు సీఆర్డీఏకు క్లియరెన్స్
- అజెండాలోని 26 అంశాలకు కేబినెట్ ఓకే
- 'రెవిన్యూ'ని ప్రక్షాళన చేయాలన్న సీఎం చంద్రబాబు

4

మలివిడత ల్యాండ్‌పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు..

### పాత విధానంలోనే ప్యాకేజీ

- రైతులకు భరోసా ఇచ్చాకే.. ల్యాండ్ పూలింగ్‌పై ముందుకు
- మీడియా సమావేశంలో వెల్లడించిన మంత్రి నారాయణ

6

## అమరావతి ఇన్‌స్టాపబుల్



- బ్యాంకుల ప్రధాన కార్యాలయాలతో ఆర్థిక కేంద్రంగా అమరావతి
- పూర్వోదయ స్కీంతో రాష్ట్రానికి చేయూతనివ్వండి
- పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుకు సాయం అందించండి
- కేంద్ర సహకారంతో... దేశ ప్రగతికి బ్యాక్ బోన్‌గా ఏపీ
- అమరావతి రైతులకు క్యాపిటల్ గెయిన్స్ గడువు పొడిగించండి
- జాతీయ బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు
- రాజధానిలో కాస్మోస్ ప్లానెటోరియం నిర్మాణానికి ఎంఓయూ

- వివరాలు 2లో...

## పింఛన్లు.. రూ.2738.71 కోట్లు విడుదల

- డిసెంబర్‌లో 63,25,999 మందికి 'ఎన్టీఆర్ భరోసా'
- ఏలూరు జిల్లా గోపాలాపురంలో పెన్షన్ల పంపిణీకి సీఎం చంద్రబాబు

3

అమరావతి నిర్మాణం..

## ఓ యజ్ఞం

- ఆంధ్రప్రదేశ్‌కు అన్ని రకాలుగా సహకారం అందిస్తున్నాం
- సీమ అభివృద్ధికి పూర్వోదయ స్కీమ్ ప్రతిపాదనలు బాగున్నాయి
- అమరావతికి ఆర్థిక భరోసా కోసమే బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- రాజధానిలో బ్యాంకులు, బీమా కార్యాలయాలకు శంకుస్థాపన

3



పీపీపీ వైద్య కళాశాలల భూముల్లో

## వాణిజ్య కార్యక్రమాలు నిషిద్ధం

- 4 కళాశాలలకు.. కేటాయించిన భూముల్లో 60 ఎకరాలమేరకు తగ్గింపు
- వీటికి ప్రభుత్వ వైద్య కళాశాల మరియు ఆసుపత్రి అనే పేరు పెట్టాలి
- ఇకనుండి ప్రయివేట్ ఆయుష్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు

7

## ఆర్థిక కేంద్రంగా అమరావతి




- రాష్ట్ర పునర్నిర్మాణానికి కేంద్రం ఎనలేని సాయం
- బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల కార్యకలాపాలతో ఆర్థిక వృద్ధి
- ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్ద పీట
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

8

## రైతుల త్యాగం.. 'అమరావతి'

- దేవతల రాజధాని విధ్వంసానికి దెయ్యాల విఫలయత్నం
- 1631రోజులు కొనసాగిన అమరావతి ఉద్యమం ఒక చరిత్ర
- ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ప్రజా ప్రభుత్వం విధానం
- రాష్ట్రానికి అన్నివిధాలా సహకరిస్తున్న నిర్మలా సీతారామన్
- 15 బ్యాంకుల కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్



5




# అమరావతి అన్‌స్టాపబుల్

- బ్యాంకుల ప్రధాన కార్యాలయాలతో ఆర్థిక కేంద్రంగా అమరావతి
- పూర్వోదయ స్కీంతో రాష్ట్రానికి చేయూతనివ్వండి
- పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుకు సాయం అందించండి
- కేంద్ర సహకారంతో... దేశ ప్రగతికి బ్యాక్ బోన్‌గా ఏపీ
- అమరావతి రైతులకు క్యాపిటల్ గెయిన్స్ గడువు పొడిగించండి
- జాతీయ బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు
- రాజధానిలో కాస్మోస్ ప్లానెటోరియం నిర్మాణానికి ఎంఓయూ



అమరావతి (చైతన్య రథం): రైతుల త్యాగం... కేంద్ర ప్రభుత్వ సహకారం, పక్కా ప్రణాళికతో అమరావతి అన్‌స్టాపబుల్‌గా అభివృద్ధి సాధిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. గత పాలకుల విధ్వంసం తర్వాత వెంటిలేటర్ మీదున్న రాష్ట్రాన్ని సాధారణ స్థితికి తీసుకురావడానికి కేంద్రం పూర్తిస్థాయిలో సహకారం అందించిందని సీఎం స్పష్టం చేశారు. రాజధానిలో ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రాజధానిలో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్లానెటోరియం నిర్మాణానికి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, చంద్రబాబు సమక్షంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ సంస్థ- సీఆర్డీఏలు ఎంఓయూ కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... "ప్రధానమంత్రి చేతుల మీదుగా అమరావతి పునర్నిర్మాణ పనుల్ని ప్రారంభించాం. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనులు వేగం అందుకున్నాయి. పనులు ఈ స్థాయిలో జరుగుతున్నాయంటే దానికి కారణం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్. 2014-19 మధ్య పనులు స్పీడప్ చేసే సమయంలో ప్రభుత్వం మారింది. ఆ తర్వాత ఐదేళ్లపాటు విధ్వంసం జరిగింది. పనులను మళ్లీ రీ-స్టార్ట్ చేశాం. రూ.15 వేల కోట్లను రాజధాని పునర్నిర్మాణానికి కేటాయించారు. నిధులకు ఇబ్బంది లేకుండా సహకరించిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు. జీఎస్టీ-2.0 సంస్కరణల్ని అమలు చేసిన తీరు అద్భుతం. జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ పెరగటంతోపాటు సామాన్యులకూ లబ్ది కలిగింది. ఆశ వదులుకున్న పోలవరాన్ని పునర్నిర్మిస్తున్నాం. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి రూ.1000 కోట్లు మంజూరు చేసిన కేంద్రానికి ధన్యవాదాలు. ప్రతీ ఇంట్లో మహిళలే ఆర్థిక మంత్రులు. మన దేశానికీ మహిళే ఆర్థిక మంత్రిగా ఉన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంలో ఆమె అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారు. దేశాన్ని ప్రధాన మంత్రి అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే... ఆర్థికమంత్రి కూడా ఆదేస్థాయిలో సహకరిస్తున్నారు. బ్యాంకులన్నింటికీ ఒకేసారి శంకుస్థాపన చేయాలని నిర్మలా సీతారామన్ ఇక్కడకు వచ్చారు. 15 ప్రభుత్వరంగ బ్యాంకులు బీమా సంస్థలు అమరావతిలో ప్రధాన కార్యలాయాల భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉంది. రూ.1,334 కోట్లతో బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు అవుతున్నాయి. బ్యాంకులు, బీమా కంపెనీల ఏర్పాటుతో 6,556 మందికి ఉద్యోగాలు వస్తాయి. అమరావతి సహా రాష్ట్రాభివృద్ధికి బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు సహకరించాలని కోరుతున్నాం" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



### అమరావతి అభివృద్ధి గని

"అనేక ఇబ్బందుల మధ్య రాష్ట్రం ఏర్పడింది. విభజన జరిగింది, రాజధాని లేదు... నాలెడ్జీ ఎకానమీ హైదరాబాద్‌కే పరిమితమైంది. విభజనతో పాటు.. గత పాలకులవల్ల ఐదేళ్లపాటు అమరావతికి జరిగిన విధ్వంసంతో చాలా ఇబ్బందులు వచ్చాయి. ఈక్రమంలో వెంటిలేటర్ మీదున్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించిన ఘనత కేంద్రం... కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌దే. రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరగాలి. కేంద్రం తెస్తున్న ప్రతి సంస్కరణలను అమలు చేస్తూ... ఆ పథకాల ద్వారా అభివృద్ధి జరిగేలా... ప్రజలకు మేలు జరిగేలా చూస్తున్నాం. అమరావతిలో రూ.56 వేలకోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించాం. సీడ్ యాక్సెస్ రోడ్ పూర్తికానుంది. అమరావతికి 7 జాతీయ రహదారులు అనుసంధానించాం. అమరావతి ప్రాంతానికి రైల్వే లైన్ రాబోతోంది. భారతదేశం గర్వపడే విధంగా అమరావతి రూపుదిద్దుకుంటుందనే గ్యారెంటీ ఇస్తున్నాం. గ్రీన్ కవర్, నెట్ జీరోవంటి కొత్త విధానాలను అమరావతికి, రాష్ట్రానికి తెస్తున్నాం. విట్, ఎస్ఆర్ఎం, ఎన్ఐడీ, బిట్స్ పిలానీ వంటి వాటితో పాటు... ప్రపంచంలోని బెస్ట్ యూనివర్శిటీలన్నీ అమరావతికి రానున్నాయి. అలాగే క్వాంటం వ్యాలీ రాబోతోంది. ఇప్పుడు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్లానిటోరియం ఏర్పాటు చేసేలా ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉంది. 2047నాటికి దేశం నెంబర్-1గా నిలుస్తుంది. ఈ ప్రగతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గణనీయమైన పాత్ర పోషిస్తుంది. రాష్ట్ర నిర్మాణాన్ని జీరోతో మొదలు పెట్టాం. 2027నాటికి పోలవరం పూర్తి చేస్తాం. 2028నాటికి అమరావతికి ఓ రూపు వస్తుంది. విశాఖ హక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పాటైన విశాఖ ఉక్కును కేంద్రం నిలబెట్టింది. సెంటిమెంటును కాపాడింది. గూగుల్ డేటా సెంటర్ విశాఖకు రావడానికి ప్రధాని ఆశీస్సులు.. నిర్మలా సీతారామన్ సహకారం ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు.

### రాష్ట్రాన్ని కరవురహితంగా చేసేలా ప్రణాళికలు

"గోదావరి-కృష్ణా నదుల అనుసంధానం చేయాల్సి ఉంది. రాష్ట్రాన్ని కరవురహితంగా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. పోలవరం- నల్లమల ప్రాజెక్టును 3 ఏళ్లల్లో పూర్తి చేస్తే రాష్ట్రం మొత్తం సస్యశ్యామలం అవుతుంది. వృధాగా సముద్రంలోకి పోతున్న నీళ్లతో ఈ ప్రాజెక్టుకు ప్రణాళికలు రూపొందించాం. దీనికి కేంద్రం సహకరించాలని కోరుతున్నాం. అలాగే రాయలసీమ డ్రాట్ మిటిగేషన్ ప్రాజెక్టుకు సహకరించాలని కోరుతున్నా. పూర్వోదయ స్కీంకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. ఈ స్కీం అమలుపై ఈ ఏడాదిలో ఓ రూపుకు తెస్తాం. కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లు సహకరిస్తే... ఆ తర్వాత దేశ ప్రగతికి బ్యాక్ బోన్‌గా మేం నిలుస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

### అమరావతి రైతుల త్యాగాలను మరువలేం

"అమరావతి రైతుల త్యాగాన్ని మరువలేం. అమరావతి కోసం పోరాటాలు చేశారు. వారిని అభినందిస్తున్నా. రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అవస్థలు పడ్డారు. 29వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూమినిచ్చారు. ప్రపంచంలో ల్యాండ్ పూలింగ్‌లాంటి అద్భుతమైన విధానం అమలు చేసిన ఏకైక ప్రాంతం అమరావతి. గత ప్రభుత్వ విధానాల కారణంగా రైతులకు రావాల్సిన క్యాపిటల్ గెయిన్స్ అందుకోలేకపోయారు. క్యాపిటల్ గెయిన్స్ గడువును మరి కొంతకాలం పొడిగించాలి. క్యాపిటల్ గెయిన్స్ ప్రయోజనాలను రైతులు పొందేలా చూడాలి. ఈ అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టిసారించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నా. ఇవన్నీ జరిగితే... అమరావతి అన్‌స్టాపబుల్" అని సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రులు నారా లోకేష్, నారాయణ, పయ్యావుల, కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, గుంటూరు జిల్లా కలెక్టర్ సహా రాజధాని రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### శంకుస్థాపన చేసిన బ్యాంకులు, బీమా కంపెనీల వివరాలు:

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐడీబీఐ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఆప్కాబ్, నాబార్డ్, ఎల్ఐసీ, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్.



# అమరావతి నిర్మాణం.. ఓ యజ్ఞం

- ఆంధ్రప్రదేశ్‌కు అన్ని రకాలుగా సహకారం అందిస్తున్నాం
- సీమ అభివృద్ధికి పూర్వోదయ స్కీమ్ ప్రతిపాదనలు బాగున్నాయి
- అమరావతికి ఆర్థిక భరోసా కోసమే బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- రాజధానిలో బ్యాంకులు, బీమా కార్యాలయాలకు శంకుస్థాపన



అమరావతి (చైతన్య రథం): పూర్వోదయ పథకం కింద రాయలసీమ అభివృద్ధికి రాష్ట్రం సిద్ధం చేసిన ప్రణాళికలపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసలు కురిపించారు. పూర్వోదయ పథకంకింద 9 జిల్లాల అభివృద్ధికి సహకరిస్తామని ఆమె స్పష్టం చేశారు. రాజధానిలో 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ మాట్లాడుతూ.. 9 జిల్లాల్లోని ఉద్యాన ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల మార్కెట్‌లకు తరలించేందుకు వీలుగా బ్యాంకులు సహకరించాలని ఆదేశించారు. కేవలం కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలకే పరిమితం కావొద్దని జాతీయ బ్యాంకులకు సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్, కోల్డ్ చెయిన్‌లాంటి పరిశ్రమలకూ చేయూతనివ్వడం ద్వారా రైతులకు సహకరించాలన్నారు. మహారాష్ట్రనుంచి అరటి, తమిళనాడునుంచి కొబ్బరిలాంటి ఉత్పత్తులు ముంబయి, ఢిల్లీలాంటి ప్రాంతాలకు రైళ్లలో తరలిస్తున్నారని.. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో పండే ఉద్యాన పంట ఉత్పత్తుల విషయంలోనూ ఇదే తరహాలో రైతులకు సహకారం అందించాలని స్పష్టం చేశారు. దేశానికి పౌష్టికాహారం అందించే రైతులకు దానికిమించి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని జాతీయ బ్యాంకుల చైర్మన్లు, ఎండీలకు సూచించారు. అలాగే రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవడం బ్యాంకుల బాధ్యతగా పేర్కొన్నారు. పూర్వోదయ స్కీమ్ కింద రాయలసీమ జిల్లాలు ప్రకాశం జిల్లాల్లో ఉద్యాన పంటల అభివృద్ధికి, రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల కోసం ఏపీ ప్రణాళికలు రూపొందించింది. ఈ పథకంలో భాగంగా రూ.39వేల కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

## అమరావతికి ఆర్థిక భరోసాగా బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం ఓ యజ్ఞమని నిర్మలా సీతారామన్ అభివర్ణించారు. రాజధాని పనుల పున:ప్రారంభం సంతోషదాయకమన్నారు. నిర్మాణ పనులకు ప్రధాని మోదీ కూడా సహకరిస్తున్నారని.. ఇంత పెద్ద నగరానికి ఆర్థికంగా భరోసాగా ఉండాలన్న నిర్ణయంతోనే ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు అవుతున్నాయని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. రాజధానిలో ఒకేచోట బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు ఉండటం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ గురించి ప్రధాని మోదీవద్ద ఎప్పుడు ప్రస్తావించినా... వాటిని తక్షణం ఆమోదిస్తారని.. విభజన తర్వాత ఇబ్బందులు ఎదుర్కొన్న రాష్ట్రానికి పూర్తిగా సహకరించాలని చెప్పారని అన్నారు. క్వాంటం వ్యాలీతో పాటు రాష్ట్రంలో ఏఐ ప్రాజెక్టుల కోసం జిల్లాల్లో ఏఐ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర మంత్రి తెలిపారు. ఐటీతోపాటు ఆస్ట్రో ఫిజిక్స్‌లాంటి వాటిపైనా కేంద్రం ఆలోచన చేస్తోందన్నారు. భవిష్యత్ రాజధాని అమరావతి నగరంలో అత్యాధునిక ప్లానెటోరియం ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ సంస్థతో ఒప్పందం చేసుకోవటం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఏడాదిన్నరలోగా ఈ ప్లానెటోరియం నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఏపీ ప్రజలెప్పుడూ సైన్సులో నిపుణులని.. గతంలో బెనారస్ యూనివర్సిటీలో సైన్సు విభాగంలో వారిదే అగ్రస్థానమని మంత్రి సీతారామన్ గుర్తు చేసుకున్నారు. ఆచార్య నాగార్జునుడి సైన్సు సూత్రాలను టిబెట్‌లో కూడా చెప్పుకుంటారని మంత్రి గుర్తు చేశారు. కేంద్రం ఐటీతోపాటు ఆస్ట్రో ఫిజిక్స్ గురించీ ఆలోచిస్తోందని తెలిపారు. రేర్ ఎర్త్ మినరల్స్‌లాంటి రంగంలో కేంద్రం కీలకమైన నిర్ణయం తీసుకుందని.. దీనిలో ఏపీ కూడా పనిచేయాలని కేంద్ర మంత్రి కోరారు.






# పింఛన్లు.. రూ.2738.71 కోట్లు విడుదల

- డిసెంబర్‌లో 63,25,999 మందికి 'ఎన్టీఆర్ భరోసా'
- ఏలూరు జిల్లా గోపాలాపురంలో పెన్షన్ల పంపిణీకి సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీం క్రింద నవంబర్ నెలలో 63,25,999మంది లబ్ధిదారులకు రూ2738.71 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుండి విడుదల చేసినట్టు రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెలలో నూతనంగా 8190 పెన్షన్‌లు మంజూరు చేశామన్నారు. ఇందుకోసం అదనంగా రూ.3.28 కోట్లు అదనంగా వెచ్చిస్తున్నట్టు మంత్రి తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు రూ.21280 కోట్లు పెన్షన్ల క్రింద లబ్ధిదారులకు అందజేయటం జరిగిందన్నారు. డిసెంబర్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపాలపురం గ్రామ సచివాలయ పరిధిలో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ మొత్తాన్ని అందజేస్తారన్నారు. రాష్ట్రంలోని గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది పింఛనుదారుల ఇంటివద్దనే పింఛను పంపిణీ చేస్తారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.





# ఇక మలివిడత భూ సమీకరణ

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మంత్రిమండలి
- 16.6వేల ఎకరాల సమీకరణకు నిర్ణయం
- 7గ్రామాల పరిధిలో చేపట్టేందుకు సీఆర్డీఏకు క్లియరెన్స్
- అజెండాలోని 26 అంశాలకు కేబినెట్ ఓకే
- 'రెవిన్యూ'ని ప్రక్షాళన చేయాలన్న సీఎం చంద్రబాబు



విజయవాడ: అమరావతి పరిధిలో రెండో దశ భూసమీకరణకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏడు గ్రామాల పరిధిలో మరో 16,666.57 ఎకరాల భూసమీకరణకు సీఆర్డీఏకు అనుమతించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. వైకుంఠపురం, పెదమద్దూరు, ఎంద్రాయి, కర్లపూడి, వడ్లమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాల పరిధిలో సీఆర్డీఏ భూసమీకరణ చేపట్టనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దాదాపు 3 గంటలపాటు మంత్రివర్గ సమావేశం జరిగింది. అజెండాలోని 26 అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు మంత్రులతో చర్చించారు. పోలవరం వద్ద ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు తెలిపారు. అలాగే, రాజధాని రైతులు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్ చేసేందుకు కేంద్రం సహకరిస్తోందని వివరిస్తూ.. పూర్వోదయ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని చర్చించారు. 2027 మే నాటికి పోలవరం పూర్తి చేయాలనేది లక్ష్యమని, గోదావరి పుష్కరాలకంటే ముందే పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, పాడేరు వైద్య కళాశాలలు త్వరగా పూర్తి చేస్తామన్నారు.

### మరిన్ని కేబినెట్ నిర్ణయాలు..

మార్క్‌ఫెడ్ ద్వారా రూ.5వేల కోట్ల రుణానికి కేబినెట్ ఆమోదించింది. ఎస్వీ వర్సిటీలో లైవ్‌లోక్ రీసెర్చ్ కేంద్రం ఏర్పాటు, నూర్‌బాగా, దూదేకుల సహకార ఫైనాన్స్ కార్పొరేషన్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పట్టణ స్థానిక సంస్థల్లో రెగ్యులేషన్, కంట్రోల్ ఆఫ్ డిస్‌ప్లే డివైజెస్ ఏర్పాటు, పట్టణాభివృద్ధి శాఖలో పలు చట్టసవరణలు, నాబార్డ్ నుంచి ఇంధన శాఖకు రుణం, ఎమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రామ్ అమలుకు ఎస్పీవీ ఏర్పాటుకు కేబినెట్ అంగీకరించింది. అలాగే, ఫుసెసింగ్ సొసైటీలో ఒప్పంద పద్ధతి ద్వారా 16 పోస్టుల భర్తీ, పోలవరం ప్రాజెక్టు పరిధిలో రూ.542.85 కోట్ల పనులు చేపట్టడానికి, వివిధ సంస్థలకు భూకేటాయింపులపై మంత్రిమండలి విస్తృతంగా చర్చించి ఆమోదముద్ర వేసింది.

## బాషా మాస్టారి తెలుగు భాషాభిమానం భేష్

### - మంత్రి లోకేష్ ప్రశంసలు



అమరావతి (చైతన్యరథం): బాషా మాస్టారి తెలుగు భాషాభిమానం చూస్తే ముచ్చటేస్తోందని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పద్యాలు, పదాలు, గేయాలు చూడకుండా అప్పజెప్పేలా పిల్లలను తయారుచేసిన వైఎస్ఆర్ కడప జిల్లా, కొండాపురం మండలం, తాళ్ళ ప్రొద్దుటూరు మోడల్ ప్రైమరీ స్కూలులో సెకండరీ గ్రేడ్ టీచరు (ఎస్జీటీ)గా విధులు నిర్వర్తిస్తున్న హయత్ బాషా గారికి అభినందనలు.

రెగ్యులర్ సబ్జెక్టులతోపాటు తెలుగు భాషపై అభిమానంతో బోధిస్తున్న తీరు చాలా బాగుంది. వేమన పద్యాలు, సుమతి శతకాల ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయం. విద్యార్థులతో మేథ్స్ పజిల్స్ చేయిస్తూ, Maths made easy withTricks నేర్పిస్తున్న హయత్ బాషా మాస్టారి బోధనా తీరు స్ఫూర్తి నింపుతోంది.

## టీడీపీ యువనేత దమ్మాలపాటి కౌషిక్ వివాహ వేడుకకు హాజరైన మంత్రి నారా లోకేష్





మంగళగిరి (చైతన్యరథం): ఐటీడీపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ దమ్మాలపాటి ఓం సాయి కృష్ణ కౌషిక్ వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో గురువారం రాత్రి జరిగిన వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులు కౌషిక్, హరిణిలను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## భళా.. భారత్!

### ఆర్థిక వ్యవస్థ ప్రగతిపై సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపాంతరం చెందడం ఆనందాన్ని, ఉత్సాహాన్నిచ్చే అంశమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "2025-26 రెండో త్రైమాసికంలో భారతదేశం యొక్క జీడీపీ 8.2శాతం వృద్ధి సాధించడం ప్రతి పౌరుడికీ ఉత్సాహాన్నిచ్చే అంశం. ఈ వేగం భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలబెడుతుంది. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో దేశం విక్షిత్ భారత్ దార్శనికతవైపు స్థిరంగా ముందుకు సాగుతున్నందున, తయారీ, నిర్మాణం, ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్ మరియు వృత్తిపరమైన సేవలువంటి రంగాలు పెరుగుతున్న ఉత్పాదకతను, శక్తివంతమైన ఆర్థిక వాతావరణాన్ని నడిపిస్తున్నాయి. ఇది భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఎంతో ప్రోత్సాహకరమైన అంశం" అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# రైతుల త్యాగం 'అమరావతి'

- దేవతల రాజధాని విధ్వంసానికి దెయ్యాల విఫలయత్నం
- 1631రోజులు కొనసాగిన అమరావతి ఉద్యమం ఒక చరిత్ర
- ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ప్రజా ప్రభుత్వం విధానం
- రాష్ట్రానికి అన్నివిధాలా సహకరిస్తున్న నిర్మలా సీతారామన్
- 15 బ్యాంకుల కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్




అమరావతి (చైతన్యరథం): దేవతల రాజధాని, రైతుల త్యాగం.. రాజధాని అమరావతి అని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. అమరావతిని దెయ్యాలు విధ్వంసం చెయ్యాలని చూశాయి.. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి ఒక్క ఇటుక కూడా పెట్టలేదు.. నాటి ముఖ్యమంత్రి ఉండటానికి మాత్రం రూ.700 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నారు.. ఎన్ని కుట్రలు చేసినా జై అమరావతి అన్న నినాదాన్ని ఆపలేకపోయారని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. అమరావతిలో 15 జాతీయ బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉద్దండరాయునిపాలెంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 1631 రోజులు జరిగిన అమరావతి ఉద్యమం ఒక చరిత్రగా అభివర్ణించారు. చిన్న పిల్లాడి నుండి 80ఏళ్ల వృద్ధుల వరకు జై అమరావతి అంటూ జెండా పట్టారు. జై అమరావతి అన్నందుకు రైతులకు సంకెళ్లు వేశారు, మహిళా రైతులను పోలీసులతో బూటుకాళ్లతో తన్నించారు. 270 మంది రైతులు చనిపోయారు, 3 వేల మంది రైతులపై కేసులు పెట్టారు. ఆపేస్తే అగిపోవడానికి అది ఎవరి ఇంట్లో స్విచ్ కాదు, అమరావతికి శంకుస్థాపన చేసింది ప్రధాని నరేంద్ర మోదీ. ముఖ్యమంత్రి చంద్రబాబు అడిగిన వెంటనే అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించారు. ఇప్పుడు మంత్రి నారాయణ అధ్వర్యంలో అమరావతి పనులు జెట్ స్పీడ్ తో జరుగుతున్నాయి. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ప్రజా ప్రభుత్వం విధానమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## స్త్రీశక్తికి ప్రతిరూపం నిర్మలా సీతారామన్

స్త్రీ శక్తి అంటే నాకు మొదటి గుర్తు వచ్చే మొదటి పేరు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్. ఇప్పుడు ఆవిడ ఎంత ప్రశాంతంగా ఉన్నారో.. పార్లమెంట్‌లో అందుకు పూర్తి భిన్నంగా ప్రతిపక్ష నాయకులకు చుక్కలు చూపిస్తారు. మహిళలు ఎలా ఉండాలో ఆమెను చూస్తే అర్థమవుతుంది. ఆవిడ రికార్డులు ఎవరు బద్దలు కొట్టలేరు. ప్రపంచంలో అనేక మంది మహిళలు ఆర్థికశాఖ మంత్రులుగా ఉన్నారు. కానీ మన నిర్మలా సీతారామన్ అందరి రికార్డులు బద్దలు కొట్టారు. వరుసగా 8 కేంద్ర బడ్జెట్లు ప్రవేశపెట్టారు. ఆవిడ జీవితం మనకి ఒక పాఠం. లండన్‌లో హెబిటేట్ అనే ఒక గృహాలంకరణ దుకాణంలో ఆమె ప్రొఫెషనల్ కెరీర్ ప్రారంభించారు. 2008లో బీజేపీలో చేరి అధికార ప్రతినిధిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి అయ్యారు, ఆ తర్వాత కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అయ్యారు. ఫోర్బ్స్ మ్యాగజైన్ ప్రపంచంలోని 100 మంది అత్యంత శక్తివంతమైన మహిళల జాబితా ప్రకటిస్తుంది. అందులో మన నిర్మలా సీతారామన్ వరుసగా 6 సార్లు శక్తివంతమైన మహిళగా నిలబడ్డారు. ఎంత ఎదిగినా సింపుల్‌గా ఉండటం మేడమ్‌ను చూసి నేర్చుకున్నాను. చేనేత చీరల్ని ప్రమోట్ చేస్తారు. అనేకసార్లు మంగళగిరి చీరలు కూడా ప్రమోట్ చేశారు. అందుకు మేడమ్‌కి మంగళగిరి చేనేతల తరపున ప్రత్యేక ధన్యవాదాలు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే జీఎస్టీ 2.0 సంస్కరణలు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు కలిసి రాష్ట్రానికి సాయం చెయ్యాలని కోరినా వెంటనే స్పందించే అండగా నిలచారు మన నిర్మలా సీతారామన్. ఆగిపోయిన అమరావతి పనులను సరైన దారిలోపెట్టి అవసరమైన ఆర్థికవనరులు అందించారు. పోలవరాన్ని గత ప్రభుత్వంలో రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపన చేసి, కాఫర్ డ్యామ్, ఇతర ముఖ్యమైన కాంపొనెంట్స్‌ని దెబ్బతీస్తే... ప్రత్యేకంగా నిపుణుల బృందాన్ని ఏర్పాటుచేసి సరైన దారిలో పెట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు అర్థరాత్రి 12గంటల సమయంలో ముఖ్యమంత్రితో మీటింగ్ పెట్టి నిధులు కేటాయించి స్టీల్ ప్లాంట్‌ను సరైన దారిలో పెట్టారు. ఈరోజు ప్రపంచమంతా విశాఖవైపు చూస్తోంది,దానికి కారణంగా భారతదేశంలో అతిపెద్ద డేటా సెంటర్ ఇన్వెస్టిమెంట్. ఇప్పుడు అందరూ క్రెడిట్ తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. గూగుల్ విశాఖకు రావడానికి అండగా నిలబడి అవసరమైన భరోసా అందించారు నిర్మలా సీతారామన్. ఆమె అండగా నిలవడం వల్లే అనుకున్న పనులు చేయగలుగుతున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.




## అమరావతి రైతులకు అండగా ఉంటాం

ఒకేరోజు 15 బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేశారు. ఈ బ్యాంకుల నిర్మాణంతో అమరావతిలో బ్యాంక్ స్ట్రీట్ ఏర్పాటు అవుతుంది. 15 బ్యాంకులు, వివిధ బీమా సంస్థలు రూ.1,334కోట్లతో ఈ కార్యాలయాలు ఏర్పాటు చేయబోతున్నాయి. వీటి ద్వారా సుమారు 7వేల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఇందుకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, నాబార్డ్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఐడిబిఐ బ్యాంక్, ఎల్ఐసి, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులకు ధన్యావాదాలు. బ్యాంక్ స్ట్రీట్ ద్వారా అన్ని బ్యాంకింగ్ సేవలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయి. అమరావతి నిర్మాణంలో కూడా బ్యాంకులు కీలకపాత్ర పోషిస్తాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకారం అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కి మంత్రి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. అమరావతి రైతులు ఒక విషయాన్ని గమనించాలి. గత అయిదేళ్లు మనందరం తీవ్రంగా నష్టపోయాం. ఇంత పెద్ద ప్రాజెక్టు చేపట్టినపుడు చిన్నచిన్న ఇబ్బందులు ఉంటాయి.వాటిని పరిష్కరించడానికి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్, నేను ఉన్నాం. కలసికట్టుగా ముందుకు వెళ్లాలి, మీ అందరికీ అండగా మేముంటామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మున్సిపల్ మంత్రి పొంగూరి నారాయణ, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, టూరిజం మంత్రి కందుల దుర్గేష్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, తదితరులు పాల్గొన్నారు.





# మలివిడత ల్యాండ్‌పూలింగ్!

- రాజధాని విస్తరణ భూముల సేకరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- 16,666.56 ఎకరాల సేకరణకు నిర్ణయం
- రైల్వే లైన్..స్టేషన్, స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసమే
- అమరావతి, తుళ్లూరు మండలాల్లోని 7 గ్రామాల్లో పూలింగ్
- భూములిచ్చిన రైతులకు.. పాత విధానంలోనే ప్యాకేజీ అమలు
- రైతులకు భరోసా ఇచ్చాకే.. ల్యాండ్ పూలింగ్‌పై ముందుకు
- మీడియా సమావేశంలో వెల్లడించిన మంత్రి నారాయణ




అమరావతి (చైతన్య రథం): రాజధాని అమరావతి విస్తరణలో భాగంగా మలివిడత ల్యాండ్ పూలింగ్‌కు కేబినెట్ ఆమోదముద్ర వేసిందని మంత్రి నారాయణ వెల్లడించారు. రెండో విడతలో మొత్తం ఏడు గ్రామాల్లో ల్యాండ్‌పూలింగ్ ద్వారా భూములు తీసుకునేందుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. శుక్రవారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. "రాజధానిలో రానున్న 30యేళ్లకు వీలుగా ప్రజల జీవనస్థితి ఉండేలా కార్యాచరణ రూపొందించాం. అమరావతి రాజధానిలో ప్రస్తుతమున్న భూముల రేట్లు పెరగాలన్నా... గ్రోత్ రేట్ రావాలన్నా ఖచ్చితంగా స్మార్ట్ ఇండస్ట్రీలు తప్పనిసరి. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లేనిదే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యం కాదు. అందుకే 500 ఎకరాల్లో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు" అని వెల్లడించారు. అమరావతి చుట్టూ ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్, రైల్వే స్టేషన్, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీకి సంబంధించి 16,666.56 ఎకరాలు ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించేందుకు కేబినెట్ ఆమోదముద్ర వేసిందని మంత్రి తెలిపారు. వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడిలో 7,562 ఎకరాలు, వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమిలో 9,104.57 ఎకరాలు కలిపి మొత్తం 16,666 ఎకరాలు ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకునేందుకు కేబినెట్ నిర్ణయించిందన్నారు. ఇదికాకుండా ప్రభుత్వ భూమి మరో 3,828 ఎకరాలు ఉందని, వీటిలో ఎక్కువగా కొండలు ఉన్నాయన్నారు. ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు గతంలో ఇచ్చిన విధంగానే నిబంధనలు అమలు చేస్తామన్నారు. జరీబు భూమికి నివాస ప్లాటు 1000 చదరపు గజాలు, వాణిజ్య ప్లాటు 450 చ.గ., మెట్ట భూములకు నివాస ప్లాటు 1000 చ.గ, వాణిజ్య ప్లాటు 250 చదరపు గజాలు కేటాయిస్తామన్నారు. కౌలు కూడా గతంలో మాదిరిగానే చెల్లిస్తామని మంత్రి స్పష్టం చేసారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పంపించిన తీర్మానాలను కేబినెట్ ఆమోదించినట్లు మంత్రి చెప్పారు.

గతంలో స్పోర్ట్స్ సిటీకి 70 ఎకరాలు మాత్రమే కేటాయించామ, ఒలింపిక్‌వంటి ఇంటర్నేషనల్ క్రీడలు నిర్వహించాలంటే 2500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ ఉండాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. ఇలా జరిగితే ఎకనమిక్ గ్రోత్ పెరిగి తద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పెరుగుతుంది. ఎయిర్ పోర్టుకు, స్మార్ట్ ఇండస్ట్రీస్‌కు కూడా ల్యాండ్ పూలింగ్ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారని మంత్రి వెల్లడించారు. గతంలో భూములిచ్చిన రైతులందరికీ ప్లాట్లు ఇచ్చామని, అయితే కొన్నిచోట్ల జరీబు -నాన్ జరీబు సమస్యతోపాటు రోడ్డు శూల, గ్రామ కంఠాల భూమలు అంశంపై రైతులతో మాట్లాడుతున్నట్టు మంత్రి చెప్పారు. గ్రామ కంఠాల విషయంలో ఎవరికైనా పొరపాటున ఎక్కువ భూమి ఇచ్చివుంటే వెనక్కి తీసుకోవాలని సీఎం ఆదేశించారన్నారు. నెలరోజుల్లోగా ఆయా సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు. మరోవైపు అసైన్డ్ రైతుల సమస్యను మంత్రివర్గ ఉపసంఘం పరిశీలిస్తుందని, ఇక రైతుల రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా తుదిదశకు చేరుకుందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# వైద్యసేవ మరింత విస్తృతం

- జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ టీడీ జనార్దన్ వెల్లడి
- వైద్య సేవకు వివిధ సంస్థలతో ఎంవోయూలు
- సహకారం అందిస్తామన్న రోటరీ, రౌండ్ టేబుల్ సంస్థలు



విజయవాడ(చైతన్య రథం): జయప్రద ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకూ అందిస్తోన్న వైద్య సేవలను మరింత విస్తృతం చేస్తున్నట్టు ఫౌండేషన్ ఛైర్మన్, తెలుగుదేశంపార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు తొండపు దశరథ జనార్దన్ స్పష్టం చేశారు. ఫౌండేషన్ ద్వారా వైద్య సేవను విస్తృతం చేయడంలో భాగంగా వివిధ వైద్య సంస్థలతో శుక్రవారం ఎంవోయూలు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఛైర్మన్ జనార్దన్ మాట్లాడుతూ.. 2018లో ఏర్పాటు చేసిన జయప్రద ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకూ 65వేల మందికి వైద్య సేవలు అందించామన్నారు. ఫౌండేషన్ తరఫున ఇప్పటి వరకూ జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆప్తమాలీజీ, డెంటర్ విభాగాలలో సేవలు అందించామన్నారు. ఈ సేవలను మరింత విస్తృతంచేయడంలో భాగంగా శుక్రవారం ఆంకాలజీ క్యాన్సర్ స్క్రీనింగ్‌కు సంబంధించిన వైద్య సేవలు అందించేందుకు ప్రతిష్టాత్మక ఒమేగా -అను ఆస్పత్రులతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు వెల్లడించారు.అలాగే,రక్తనాళాల సమస్యలకు సంబంధించి హర్ష వాసిక్యులర్ సెంటర్, కంటికి సంబంధించిన వైద్యసేవలకోసం శంకర్ నేత్రచికిత్సాలయం, దంత వైద్యసేవల కోసం హ్యాపీ డెంటల్ సంస్థలతో ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీషా సమక్షంలో పరస్పరఅవగాహన ఒప్పందాలుకుదుర్చుకున్నట్టు ఛైర్మన్ టీడీ జనార్ధన్ వెల్లడించారు. ఈ సందర్భంగా జయప్రద ఫౌండేషన్ నూతన యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ అందిస్తోన్న విస్తృత వైద్యసేవకు తమవంతు సహకారం అందిస్తామని అమరావతి రోటరీక్లబ్, విజయవాడ రౌండ్ టేబుల్ సంస్థలు ముందుకురావడం హర్షణీయం.

# పీపీపీ వైద్య కళాశాలల భూముల్లో
# వాణిజ్య కార్యకలాపాలు నిషిద్ధం

- 4 కళాశాలలకు.. కేటాయించిన భూముల్లో 60 ఎకరాలమేరకు తగ్గింపు
- వీటికి ప్రభుత్వ వైద్య కళాశాల మరియు ఆసుపత్రి అనే పేరు పెట్టాలి
- ఇకనుండి ప్రయివేట్ ఆయుష్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు



అమరావతి (చైతన్య రథం): వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి శుక్రవారం జరిగిన మంత్రిమండలి సమావేశం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో పీపీపీ విధానంలో చేపట్టనున్న ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ, ప్రయివేట్ ఆయుష్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, నియంత్రణకు సంబంధించి వైద్యారోగ్య శాఖ ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది.

### పీపీపీ వైద్య కళాశాలల నిర్వహణపై మార్గదర్శకాలు

పీపీపీ విధానంలో చేపట్టనున్న ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర కేబినెట్ 6 ప్రధానమైన నిర్ణయాలను తీసుకుంది. ఈ కళాశాలలకు కేటాయించిన భూములను ఎటువంటి వాణిజ్యపరమైన, వైద్యేతర కార్యక్రమాలకు వినియోగించరాదని కేబినెట్ స్పష్టం చేసింది. కేటాయించిన భూముల్లో 625 పడకల ఆసుపత్రి, 150 యుజి మరియు 24 పీజీ సీట్లతో కూడిన కాలేజీ నిర్మాణం, వసతి గృహాలు, బోధన మరియు ఇతర సిబ్బంది నివాసాల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలని క్యాబినెట్ సూచించింది. వీటితోపాటు భవిష్యత్ అవసరాలమేరకు దంత వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, టెలీమెడిసిన్ కేంద్రాలు, శిక్షణ కేంద్రాలు, ఆయుష్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చని కేబినెట్ నిర్ణయించింది. ఈ అదనపు అభివృద్ధి చర్యల ద్వారా వచ్చే ఆదాయంలో 3శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది.

### భూ కేటాయింపుల్లో కోత

మొదటి దశలో పీపీపీ విధానంలో చేపట్టనున్న మార్కాపురం, మదనపల్లి, ఆదోని, పులివెందుల వైద్య కళాశాలలకు గత ప్రభుత్వం మొత్తం 257.50 ఎకరాలను కేటాయించగా తగుసమీక్ష అనంతరం వైద్యారోగ్య శాఖ దానిని 197.71ఎకరాలకు కుదిస్తూ చేసిన సిఫారసును రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. వెరసి ఆ నాలుగు కాలేజీలకు అదనంగా కేటాయించబడిన 59.79 ఎకరాలు ప్రభుత్వాధీనంలోకి వస్తాయి. ఇందులో ప్రధానంగా మదనపల్లి కాలేజీ భూములను 97 ఎకరాలనుంచి 52.47 ఎకరాలకు కుదించారు.

పీపీపీ విధానంలో ఆయా ఆసుపత్రుల నిర్వహణ అమల్లోకి వచ్చినప్పటి నుండి ఆయా కాలేజీలకు సంబంధించిన బోధానాసుపత్రుల్లో ప్రస్తుతం పని చేస్తున్న వైద్య మరియు ఇతర సిబ్బంది జీతాలను రెండేళ్లపాటు ప్రభుత్వమే భరిస్తుందని కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. పీపీపీ భాగస్వాములు సొంత ఆసుపత్రులను పూర్తిస్థాయిలో అమలు చేయడానికి పట్టే సమయాన్ని దృష్టిలో ఉంచుకుని కేబినెట్ ఈ నిర్ణయాన్ని తీసుకుంది. పీపీపీ విధానం కింద కొత్త ఆసుపత్రుల నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రస్తుతం నడుస్తున్న బోధనాసుపత్రులు తిరిగి ప్రభుత్వ పరిధిలోకొస్తాయి.

### ప్రభుత్వం పేరిటే పీపీపీ కళాశాలలు

పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తున్న కళాశాలలకు 'ప్రభుత్వ వైద్య కళాశాల మరియు ఆసుపత్రి' అని నామకరణం చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ఈ పేరుతోపాటు కళాశాల ఉండే ప్రదేశం పేరును జోడించాలి. ఉదాహరణకు... ప్రభుత్వ వైద్య కళాశాల మరియు ఆసుపత్రి, మార్కాపురం. దీనికింద పీపీపీ భాగస్వామి పేరును కూడా ప్రస్తావించవచ్చు. ఈ రెండు పేర్లను 70:30 నిష్పత్తిలో ప్రదర్శించాలి. భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పెరిగే అన్నిరకాల పడకల్లోనూ 70శాతం నగదురహిత సేవలు పొందేవారికి కేటాయించాలని కేబినెట్ నిర్దేశించింది.

### నియంత్రణ పరిధిలోకి ప్రయివేట్ ఆయుష్ ఆసుపత్రులు

ఆయుష్ సేవలకు విస్తృత ప్రాచుర్యం లభిస్తున్న తరుణంలో తగు అర్హతలులేని నకిలీ వైద్యులు ఆసుపత్రుల్ని నడపడాన్ని నియంత్రించే లక్ష్యంగా ప్రయివేట్ ఆయుష్ ఆసుపత్రుల నిర్వహణను నియంత్రించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ఈమేరకు ప్రయివేట్ ఆయుష్ ఆసుపత్రుల్ని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్, 2010 పరిధిలోకి తెచ్చేందుకు కేబినెట్ నిర్ణయించింది. ఇప్పటివరకు ప్రైవేట్ అల్లోపతిక్ ఆసుపత్రుల్ని మాత్రమే ఈ చట్టంకింద నియంత్రిస్తున్నారు. తగు చట్ట సవరణ ద్వారా ప్రయివేట్ ఆయుష్ ఆసుపత్రుల్నీ తగువిధంగా నియంత్రించేందుకు కేబినెట్ నిర్ణయించింది.

తద్వారా ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ మరియు హోమియోపతి ప్రైవేట్ ఆసుపత్రులు తగు రిజిస్ట్రేషన్ పొంది నియంత్రణ పరిధిలోకి రావాల్సి ఉంటుంది. ఈ చర్యద్వారా ఈ ఆసుపత్రుల్లో కనీస ప్రమాణాల మేరకు సిబ్బంది నియామకం, సేవల నాణ్యతను పాటించాల్సి ఉంటుంది. దీనివలన అనర్హులకు అడ్డుకట్ట వేస్తూ నాణ్యమైన సేవల్ని అందించేందుకు వీలు కలుగుతుంది. రిజిస్ట్రేషన్ మరియు రెగ్యులేషన్ ద్వారా ఆయుష్ సేవల్ని ఆశించే వారిలో నమ్మకం పెరుగుతుంది. నియమాల మేరకు ప్రామాణికమైన చికిత్సా విధానాలు, రికార్డుల నిర్వహణ పాటించాల్సి ఉంటుంది. నియమ నిబంధలన మేరకు ఆయుష్ సేవలను అందించాల్సి ఉండడంతో.. ఈ సేవలకు మరింత విస్తృతమైన ఆదరణ లభించే అవకాశమేర్పడుతుంది. బాధ్యతాయుతంగా ప్రయివేట్ ఆయుష్ ఆసుపత్రుల్ని నిర్వహించే దిశగా ఈ చట్ట సవరణ ఎంతగానో తోడ్పడుతుంది.



### సీఆర్డీఏ కార్యాలయం వద్ద
## నిర్మలా సీతారామన్‌కు ఘనస్వాగతం

అమరావతిలో 15 జాతీయ బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేసేందుకు కేంద్ర అర్థికమంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం ఉదయం సీఆర్డీఏ కార్యాలయానికి చేరుకున్నారు. ఆమెకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్. తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.









# ఆర్థిక కేంద్రంగా అమరావతి

- రాష్ట్ర పునర్నిర్మాణానికి కేంద్రం ఎనలేని సాయం
- బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల కార్యకలాపాలతో ఆర్థిక వృద్ధి
- ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్ద పీట
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర పురోగతి కోసం వేస్తున్న ప్రతి అడుగులో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు మరువలేనిదని, ముఖ్యంగా ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్రం అందిస్తోన్న ప్రోత్సాహం ఎంతో విలువైనదని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కేంద్రం నుంచి వస్తున్న ఆర్థిక సాయం కాగితాల లెక్కల్లో కరిగిపోకుండా, జరుగుతున్న అభివృద్ధి ప్రతి ఒక్కరికీ కనబడేలా జవాబుదారీతనంతో మా ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. అమరావతిలో 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు నారా లోకేష్, పొంగూరు నారాయణ, పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐడీబీఐ, ఎల్ఐసీ లాంటి 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలు ఒకేసారి, ఒకే చోట కొలువుదీరనుండటం చాలా అరుదు అన్నారు. తాజాగా పునాది వేసిన బ్యాంకింగ్ స్ట్రీట్... అమరావతి నగరానికి ఆర్థిక శక్తినిచ్చే అతిపెద్ద అడుగు. ప్రధాన బ్యాంకుల కార్యాలయాలు, ఆర్థిక సంస్థలు ఒకే చోట కొలువుదీరడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు, వ్యాపార లావాదేవీలు వేగం పుంజుకుంటాయి. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరుగుతుంది. ఆ విశ్వాసం అమరావతిని ఆర్థిక కేంద్రంగా నిలబెడుతుంది. ఈ ఆర్థిక సంస్థల ఏర్పాటు ద్వారా రాజధానికి రూ.1,328 కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు సుమారు 6,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మాటకు కట్టుబడి 34,915 ఎకరాల భూములు రాష్ట్ర భవిష్యత్తు కోసం ఇచ్చిన రైతుల నమ్మకమే అమరావతికి నగరానికి పునాది. నేడు పునాది వేసింది కేవలం భవనాలకు కాదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తుకు పడిన పునాది ఇది. అమరావతి ఒక ఆర్థిక కేంద్రం, విద్యా కేంద్రం, పరిశోధనా కేంద్రం, ఒక మంచి పరిపాలనా కేంద్రంగా ఎదగడానికి నేటి పునాది ఎంతో బలం చేకూరుస్తుందని పవన్ అన్నారు.

**కేంద్రం అండతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు**

రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లడానికి కేంద్రం ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోంది. ఎన్నో ప్రధాన ప్రాజెక్టులకు కేంద్రం అండగా నిలుస్తోంది. ఈ ఏడాది జనవరిలో విశాఖలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రూ. 2 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వీటి ద్వారా దాదాపు 7.5 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కేంద్రం అండతోనే అమరావతి పునర్నిర్మాణ పనులు రూ.1.7 లక్షల కోట్లతో ప్రారంభమయ్యాయి.

కర్నూలులో ఇటీవల జరిగిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో రూ. 13,429 కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాన మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా కొప్పర్తి- ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్ల ద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ రూ.11 వేల కోట్ల ఆర్థిక సహాయ ప్యాకేజీని కేంద్రం అందించింది. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరానికి రూ.12,500 కోట్లు, అమరావతి రాజధాని నిర్మాణానికి రూ. 15 వేల కోట్లు ఆర్థిక సాయాన్ని సమకూర్చింది. రాష్ట్రంపై ప్రత్యేక అభిమానంతో నిధులు కేటాయిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి పవన్ కళ్యాణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# కేంద్రం అండతో ఊపిరి పోసుకున్న ఏపీ

- రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

అమరావతి (చైతన్యరథం): గత పాలకుల విధ్వంస పాలనతో అధోగతిపాలై ఐసీయూలో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం ఆక్సిజన్ అందించిందని రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ కృతజ్ఞతలు తెలిపారు. రాజధాని అమరావతిలో శుక్రవారం బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు, బీమా కంపెనీల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ కేంద్రానికి రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. బ్యాంకుల ప్రధాన కార్యాలయాలతో దేశ ఆర్థిక వ్యవస్థ అంతా ఏపీకి వచ్చినట్లుగా ఉందన్నారు. ఆర్థిక వనరుల విషయంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కాస్త కఠినంగానే ఉంటారు. అయితే మన ఇంట్లో అమ్మలాగే ఎప్పుడు ఏది అవసరమో, అప్పుడే నిధులు ఇస్తారు. ఇంత పెద్ద భారతదేశంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను నిర్వహించటం మాటలు కాదు. మా రాజకీయ హెడ్ మాస్టర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఫలితాలు సాధించే విషయంలో కఠినంగానే ఉంటారు. వాటి ప్రతిఫలాలు ప్రజలకు అందిస్తున్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌కు ఇంధనం-ధనమే. వందేభారత్ రైళ్లు, డిఫెన్స్ సెక్టార్, విద్య, వైద్య రంగాల్లో నిధుల కేటాయింపు పెరుగుతోంది. దేశం గుర్తు పెట్టుకునేలా కేంద్ర ఆర్థిక మంత్రి సేవలు అందిస్తున్నారు. జీఎస్టీ సంస్కరణలు ప్రకటించిన అనంతరం అత్యంత వేగంగా దానిని దేశవ్యాప్తంగా అమలు చేయటం ఆశ్చర్యపరిచింది. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణానికి, విశాఖ ఉక్కుకు కేంద్రం ఎంతగానో ఆర్థిక సహకారం అందిస్తోందని మంత్రి పయ్యావుల తెలిపారు.

## టీటీడీని దోచిన దొంగలు

# నార్కో అనాలసిస్ టెస్ట్‌కి సిద్ధమా?

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సవాల్



అమరావతి (చైతన్యరథం): టీటీడీని దోచుకున్న దొంగలు నార్కో అనాలిసిస్ టెస్ట్‌కి సిద్ధమా అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సవాల్ చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వర్ల రామయ్య మాట్లాడుతూ.. టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డిలపై విమర్శలు గుప్పించారు. వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి.. ధర్మరాజు వారసుల మాదిరిగా నీతిమంతులుగా పైకి కనిపిస్తున్నప్పటికీ తెరచాటున దొంగ పనులు, తప్పుడు పనులు చేశారని ఆరోపించారు. స్వామివారి సేవ చేయమని పదవులు ఇస్తే, స్వామివారి సొమ్మునే దోచుకున్న ఘనపాటీలు వీరని దుయ్యబట్టారు. ముఖ్యంగా వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్న కాలంలో కల్తీ నెయ్యి సరఫరా జరిగిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 68 లక్షల కేజీల కల్తీ నెయ్యి టీటీడీకి సరఫరా అయినట్లు సిట్ విచారణలో బయటపడిందని, దీనికి సూత్రధారి వైవీ సుబ్బారెడ్డేనని ఆరోపించారు. ఈ కల్తీ నెయ్యి కేసులో వైవీ సుబ్బారెడ్డి 'లైవ్ డిటెక్షన్ టెస్ట్'కు సిద్ధమని చెప్పడాన్ని తప్పు పడుతూ, నిజంగా నిజాయితీ ఉంటే నార్కో అనాలసిస్ టెస్టుకు సుబ్బారెడ్డి సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. నార్కో అనాలసిస్‌కు వస్తే చిన్నప్పన్నకు, సుబ్బారెడ్డికి, ఇతర పెద్దలకు ఎంతెంత వెళ్లిందో ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న వాస్తవాలు బయటపడతాయన్నారు. కల్తీ నెయ్యి సరఫరా చేసిన కంపెనీలైన ప్రీమియర్ అగ్రిఫుడ్, వైష్ణవి డెయిరీ, బొలే బాబా డెయిరీల నుండి వచ్చిన నమూనాల్లో కల్తీ జరిగినట్లు ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్ ఉన్నా కమీషన్ల కోసం వారిపై చర్యలు తీసుకోలేదు. సీఐడీ అడిగినా వైవీ సుబ్బారెడ్డి తన బ్యాంక్ అకౌంట్స్ వివరాలు ఇవ్వకపోవడంపై వర్ల రామయ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాఫీలు, టీలు అందించే చిన్నప్పన్న అకౌంట్లోనే రూ. 5-6 కోట్లు ఉంటే, అసలు ఘనపాటి అయిన సుబ్బారెడ్డి అకౌంట్‌లో ఎంత ఉండాలని ప్రశ్నించారు. కేజీ నెయ్యి రూ. 320 చొప్పున 68 లక్షల కేజీలు అమ్మితే, కమీషన్ వందల కోట్లలో ఉంటుందని, అందుకే అకౌంట్స్ వివరాలు ఇవ్వకుండా కోర్టుకు వెళ్లారని, ఇది వారి డొల్లతనాన్ని బయటపెట్టిందని స్పష్టం చేశారు. అలాగే టెండర్ నిబంధనలు సడలించి దొంగ కంపెనీల నుంచి నెయ్యి ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. ఈ తప్పును అధికారులపైకి నెట్టి కమీషన్లు మాత్రం సుబ్బారెడ్డి, ఇతర పెద్దలు తిన్నారని వర్ల రామయ్య ఆరోపించారు.

**నిబంధనల ఉల్లంఘన**

ఇక పరకామణి చోరీ కేసుకు సంబంధించి ఏదైనా ఆస్తి లేదా పెద్ద బహుమతిని స్వామివారి పేరుతో స్వీకరించే ముందు, దాని గురించి 30 రోజుల ముందుగా ప్రముఖ దినపత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలి. ఈ 30 రోజుల వ్యవధిలో ఆ గిఫ్ట్ లేదా ఆస్తిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నాయేమో పరిశీలించాలి. ఎటువంటి అభ్యంతరాలు లేకపోతేనే లేదా అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాతే, ఆ గిఫ్ట్‌ను టీటీడీ బోర్డు తరపున అంగీకరించాలి. నిబంధనల ప్రకారం, బహిరంగ ప్రకటన ఇవ్వకుండా, అభ్యంతరాల పరిశీలన లేకుండా గిఫ్ట్ పత్రాన్ని ఆమోదించడం అనేది టీటీడీ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. ముద్దాయిగా ఉన్న వ్యక్తి ఇచ్చిన ఆస్తుల బహుమతిని అత్యంత వేగంగా, రహస్యంగా ఆమోదించడానికి గల కారణాలు చెప్పాలని డిమాండ్ చేశారు. చార్లెస్ శోభరాజ్, వీరప్పన్, ఎస్కోబార్ లాంటి పేరుగాంచిన కరుడుగట్టిన నేరస్థుల వరకూ అందరూ నేరం రుజువయ్యేంత వరకు తాము తప్పు చేయలేదని, నీతి మంతులమని చెప్పుకుంటారు. అదేవిధంగా వైవీ సుబ్బారెడ్డి కూడా అదే పంథాలో 'లైవ్ డిటెక్షన్ టెస్ట్'కు సిద్ధమని చెప్పుకున్నారు. 'నార్కో అనాలసిస్'కు సిద్ధపడితే నిజాలు బయటికి వస్తాయని వర్ల రామయ్య స్పష్టం చేశారు.

**తప్పుచేసి దబాయింపులు**

సజ్జల రామకృష్ణ రెడ్డి వంటి వైసీపీ నాయకులు కల్తీ నెయ్యి కేసులో సీబీఐ దర్యాప్తు వెనుక చంద్రబాబు నాయుడు ఉన్నారని మాట్లాడటంపై వర్ల మండిపడ్డారు. కల్తీ నెయ్యి కేసును దర్యాప్తు చేయమని ఆదేశించింది చంద్రబాబు కాదు సుప్రీంకోర్టు అని, అదేవిధంగా పరకామణి కేసును దర్యాప్తు చేయమని ఆదేశించింది హైకోర్టు అని స్పష్టం చేశారు. ఈ దర్యాప్తులు జరుగుతుంటే వాటి వెనుక చంద్రబాబు నాయుడు ఉన్నారని అనడం అవగాహన రాహిత్యమని విమర్శించారు. నేరం చేయనివారు ప్రమాణాలు చేయాల్సిన అవసరం లేదని, దొంగతనం చేసినవాడే ప్రమాణం చేస్తాను, లైవ్ డిటెక్టివ్‌కు వస్తానంటాడని, ఇది వైసీపీ నాయకులకు అలవాటైందని ధ్వజమెత్తారు. రూ.428కి నెయ్యి సరఫరా చేయలేమని తిరస్కరించిన ఏఆర్ డెయిరీ ఆ తర్వాత రూ.320కి పది లక్షల కేజీల నెయ్యిని ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అంటే అది నెయ్యి కాదని, టీటీడీని మోసం చేశారని స్పష్టమవుతోందని అన్నారు. స్వామివారికి అన్యాయం చేసిన ఏ వ్యక్తి కూడా బాగుపడలేదని హెచ్చరిస్తూ ఈ దుర్మార్గపు పనుల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, గత ప్రభుత్వ హయాంలో భక్తుల రద్దీ కూడా తగ్గిందని అభిప్రాయపడ్డారు. స్వామివారు కన్ను తెరిచిన రోజున, స్వామివారి చూపు మీ మీద పడ్డరోజున మీ పరిస్థితి వర్ణనాతీతం.. స్వామివారి సొమ్మును దోచుకున్న వారు ఎవరూ బతికి బట్టకట్టలేదని వర్ల రామయ్య తేల్చిచెప్పారు.



## తిరుపతిలో స్పోర్ట్స్ హబ్‌కు 28 ఎకరాలు

**- సీఎం చంద్రబాబుకి శాప్ చైర్మన్ రవినాయుడు కృతజ్ఞతలు**

అమరావతి (చైతన్యరథం): తిరుపతి నగరానికి జాతీయ స్థాయి క్రీడా మౌలిక వసతుల ఏర్పాటు దిశగా మరో కీలక అడుగు పడింది. తిరుపతిలో స్పోర్ట్స్ హబ్ నిర్మాణం కోసం దామినీడు వద్ద 28ఎకరాల భూమిని కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకి శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. తిరుపతిలో క్రీడా హబ్ ఏర్పాటు కోసం గతంలో స్వయంగా సీఎం చంద్రబాబుకి వినతిపత్రం అందజేయడంతో పాటు, పలుమార్లు ఈ అంశాన్ని ఆయన దృష్టికి రవినాయుడు తీసుకెళ్లారు. అంతేకాకుండా, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, అనగాని సత్య ప్రసాద్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా ప్రతిపాదనలు తీసుకెళ్లారు. ఆ క్రమంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తిరుపతి దామినేడు వద్ద స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో "క్రీడాంధ్రప్రదేశ్" రూప కల్పనలో ఈ నిర్ణయం ఒక కీలక మైలురాయి కానుందని, తిరుపతి క్రీడా హబ్‌గా అభివృద్ధి చెందేందుకు ఇది మార్గదర్శ కంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. దక్షిణ భారతదేశానికి తిరుపతి రానున్న రోజుల్లో ప్రధాన క్రీడా కేంద్రంగా అవతరించనున్నదని రవి నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

## దిత్వాపై అప్రమత్తం

**- అధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష**

అమరావతి (చైతన్యరథం): దిత్వా తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. తుపాను ప్రభావం చూపే అవకాశం ఉన్న తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల అధికారులతో హోంమంత్రి వంగలపూడి అనిత సమీక్ష నిర్వహించారు. మరో రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. శిథిలావస్థ స్థితిలో ఉన్న ఇళ్లలో నివసించే వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని హోంమంత్రి అన్నారు. ఎక్కడా పాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. కోస్తా తీరం వెంబడి ఈదురుగాలుల హెచ్చరికలు ఉన్నందున ప్రమాదకరమైన హోర్డింగ్స్‌ను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల్లో, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి సూచించారు. రైతాంగం వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి అనిత కీలక సూచనలు చేశారు.

కాగా.. నైరుతీ బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో దిత్వా తుఫాను కేంద్రీకృతమై ఉంది. ప్రస్తుతానికి ఇది శ్రీలంకకు 80 కిలోమీటర్ల దూరంలో, పుదుచ్చేరికి 480 కిలోమీటర్లు, చెన్నైకి 580 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుపాను గంటకు 8 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఈనెల 30కి నైరుతీ బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాలకు చేరుకునే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. దీని ప్రభావంతో కోస్తా, రాయలసీమలో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదని, రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. శనివారం మధ్యాహ్నం నుంచి దిత్వా తుఫాను ప్రభావం కొన్నిచోట్ల ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# సామాజిక విప్లవానికి మార్గదర్శకుడు పూలే

**- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా నివాళి**



విశాఖపట్నం (చైతన్యరథం): సామాజిక అసమానతలను రూపు మాపేందుకు మహాత్మా జ్యోతిరావు పూలే తన జీవితాంతం పోరాడారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పల్లా శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ భారతదేశ సామాజిక విప్లవానికి పూలేను మార్గదర్శకులని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం తన జీవితాంతం పోరాడిన దార్శనికుడిగా అభివర్ణించారు. దేశంలో నేడు పెరిగిన సామాజిక స్పృహకు పూలే నిర్దేశించిన మార్గమే పునాదిగా పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల హక్కుల కోసం, అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి, మహిళల సాధికారతకు పూలే చేసిన అవిశ్రాంత పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. దేశ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహానుభావుడు పూలే అన్నారు. పూలే చూపించిన మార్గంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. స్వయం సహాయక బృందాల ఏర్పాటు, మహిళలకు ఆర్థిక స్వయంప్రతిపత్తి, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సమాన అవకాశాల కల్పన, విద్య, ఉపాధి రంగాలలో సంస్కరణలు సీఎం చంద్రబాబు నిబద్ధతకు నిదర్శనాలుగా పల్లా పేర్కొన్నారు. అందరికీ సమాన అవకాశాలు.. అనే సిద్ధాంతంతో రాష్ట్ర సమగ్ర పురోగతికి సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని పల్లా పేర్కొన్నారు.

# ఆంధ్రుల భవిష్యత్ కల అమరావతి

**- కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**



అమరావతి (చైతన్యరథం): అమరావతి అంటే ప్రతి ఆంధ్రుడి కలల రాజధాని అని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అమరావతిలో 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శు క్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ 8 మార్లు ఆర్థికమంత్రిగా కేంద్ర బడ్జెట్లు ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్ చరిత్ర సృష్టించారన్నారు. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను విలీనం చేసి ఖాయిలా ప్రమాదం నుంచి వాటిని కాపాడారని కొనియాడారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారికి నిర్మలాసీతారామన్ స్ఫూర్తి అన్నారు. రాజధాని అమరావతి కోసం 34 వేల ఎకరాలను రైతులు త్యాగం చేశారని గుర్తుచేశారు. అమరావతి అంటే ఆంధ్రుల ఆత్మవిశ్వాసం, రాష్ట్ర భవిష్యత్ కలగా అభివర్ణించారు. ప్రధాన మోదీ సహకారంలో సీఎం చంద్రబాబు సారథ్యంలో అమరావతి అద్భుత రాజధానిగా రూపుదిద్దుకుంటుందని పెమ్మసాని విశ్వాసం వ్యక్తం చేశారు.

# రైతులపై వైసీపీది కపట ప్రేమ

**- ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ**



రాజాం (చైతన్యరథం): రైతుల విషయంలో వైసీపీ కపట ప్రేమ ప్రదర్శిస్తోందని ఎమ్మెల్సీ గ్రీష్మ విమర్శలు చేశారు. శ్రీకాకుళం జిల్లా రాజాం నియోజకవర్గం పొగిలి గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకంపై ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శు క్రవారం ఎమ్మెల్సీ గ్రీష్మ ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం రెండు విడతలు అందిందా లేదా అని ఆరా తీశారు. రైతులు ఈ పథకం విషయంలో సంతోషం వ్యక్తం చేశారు. గతంలో పార్టీలు చూసి ఈ పథకం అమలు చేశారని.. ఇప్పుడు రైతులందరికీ 14 వేల రూపాయల చొప్పున అందిందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రీష్మ మాట్లాడుతూ రైతులకు గతంలో ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేని సమయంలో మద్దతు ధర కల్పించిందన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ రైతుల కోసం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు పంటల సాగు సమయంలో అండగా ఉండాలన్న ఉద్దేశంతో అన్నదాత సుఖీభవ పథకాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. గతంలో పార్టీలు చూసి ఈ పథకాన్ని అమలు చేశారన్నారు. ఇప్పుడు రైతు అనే ప్రతి ఒక్కరికి సాయం అందిందని.. అది రైతులే స్పష్టంగా చెబుతున్నారని ఎమ్మెల్సీ గ్రీష్మ తెలిపారు.

## చెస్ గ్రాండ్‌మాస్టర్ రోహిత్ లలిత్ బాబుకు మంత్రి మండిపల్లి సత్కారం



విజయవాడ (చైతన్యరథం): చెస్ గ్రాండ్‌మాస్టర్ ముసునూరి రోహిత్ లలిత్ బాబును రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందించారు. కౌలాలంపూర్, మలేషియాలో నవంబర్ 8 నుండి 16 వరకు జరిగిన కామన్వెల్త్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో రోహిత్ లలిత్ బాబు కాంస్య పతకం సాధించారు. మన రాష్ట్ర క్రీడాకారుడైన రోహిత్ లలిత్ బాబు అంతర్జాతీయ వేదికపై సాధించిన విజయానికి గాను విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి మండిపల్లి సత్కరించారు. నూతన క్రీడా విధానం ప్రకారం రోహిత్ లలిత్ బాబు కు రావలసిన క్రీడా ప్రోత్సాహకాలు అందిస్తామని తెలియజేశారు.

## పిన్నెల్లి సోదరులకు సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ: పల్నాడు జంట హత్యల కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వారు దాఖలు చేసిన రెండు పిటిషన్లను కోర్టు శుక్రవారం కొట్టివేసింది. అంతేకాకుండా మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ఆదేశాలు జారీ చేశారు. హత్య కేసులో పిన్నెల్లి సోదరులకు ముందస్తు బెయిల్ కు అర్హత లేదని జస్టిస్ సందీప్ మెహతా ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. విచారణకు సహకరించాలని సుప్రీంకోర్టు చెప్పినా, సహకరించలేదని, సాక్షులను బెదిరించారని, సాక్ష్యాలను ట్యాంపరింగ్ చేసే ప్రయత్నం చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం వారిని వెంటనే అరెస్టు చేసేందుకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని వ్యాఖ్యానించింది. వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో మే 24న టీడీపీ కార్యకర్తలు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు హత్యకు గురయ్యారు. ఈ హత్యలకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డి ప్రోత్సాహమే కారణం అని పోలీసులు గుర్తించారు.

అయితే ఈ కేసులో పోలీసుల వ్యవహార తీరుపై కూడా సుప్రీం ధర్మాసనం ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. నిందితులకు పోలీసులు కూడా బాగా సహకరిస్తున్నట్లు ఉందని అభిప్రాయపడింది. సెక్షన్ 161 కింద నమోదు చేసిన డాక్యుమెంట్లు నిందితులకు ఎలా అందాయని పోలీసులను జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. ఈ అంశంపై కూడా పూర్తిస్థాయి దర్యాప్తు అవసరం అవుతుందేమోనని కూడా జస్టిస్ సందీప్ మెహతా వ్యాఖ్యానించారు. చివరకు పిన్నెల్లి సోదరుల తరపు న్యాయవాదుల అభ్యర్థన మేరకు లొంగిపోయేందుకు సుప్రీం కోర్టు రెండు వారాల సమయాన్ని ఇచ్చింది.

# పేదల ఆరోగ్యానికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం

- సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్దిదారులకు రూ.700 కోట్లు అందజేత
- అర్హులైన ప్రతి ఒక్కరికీ అన్నదాత సుఖీభవ నిధులు
- రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి అడుగులు
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అర్హులైన పేదలకు సుమారు రూ.700 కోట్లకు పైగా ఆర్థిక సాయం చేసినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శుక్రవారం నాడు బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని కొరిశపాడు మండలం, పి.గుడిపాడు గ్రామంలో నిర్వహించిన రైతు సేవలో మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు మంత్రి గొట్టిపాటి చెక్కులు అందజేశారు. అద్దంకి నియోజకవర్గంలోని 1,897 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటి వరకు రూ.17.69 కోట్ల విలువైన చెక్కులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతీ రైతుకు ఈ పథకం ద్వారా రూ. 20 వేల పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో ఈ మొత్తాన్ని విడతల వారీగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోని లోపాలను ఎత్తి చూపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇనాం భూములకు పెట్టబడి సాయాన్ని అమలు చేయలేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇనాం భూములకు కూడా అన్నదాత సుఖీభవ పథకాన్ని అందిస్తున్నామని అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. రైతన్నలకు వ్యవసాయ పనిముట్లను 90 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు.

**బీటీ రోడ్డు ప్రారంభించిన మంత్రి**

రైతుల సేవలో మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం పి.గుడిపాడు గ్రామంలో కొత్తగా రూ.1.77 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రారంభించారు. ఎన్‌హెచ్-16 నుంచి పి.గుడిపాడు వరకు రూ. 80 లక్షలతో నిర్మించిన తారు రోడ్డును, ఎన్‌హెచ్-16 నుంచి అలవలపాడు వరకు రూ. 60 లక్షలతో తారు రోడ్డును, ఎన్‌హెచ్-16 నుంచి కుర్రవానిపాలెం వరకు రూ. 17 లక్షలతో నిర్మించిన మరో తారురోడ్డుతో పాటు రూ. 20 లక్షలతో నిర్మించిన పి.గుడిపాడు గ్రామంలో సిమెంట్ రోడ్లు, సైడు డ్రైన్లను ప్రారంభించారు.

# గోదావరి పుష్కరాలకు సమగ్ర ప్రణాళిక

- అధికారులతో సమీక్షలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



అమరావతి (చైతన్యరథం): గోదావరి పుష్కరాల కోసం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులను దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించారు. గోదావరి నదికి 2027లో రానున్న పుష్కరాలను పురస్కరించుకుని చేపట్టాల్సిన ఏర్పాట్లు, సన్నాహాలు, భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఛాంబర్‌లో శుక్రవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ కోట్లాది మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించేందుకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

పుష్కర ఘాట్ల ఏర్పాట్లపై పరిశీలన చేయాలని, అవసరమైన నిధుల కేటాయింపుపై నివేదిక ఇవ్వాలని మంత్రి సూచించారు. గోదావరి పుష్కరాల -2027 అధికారిక లోగో డిజైన్ చేయాలన్నారు. ప్రొటోకాల్ ఏర్పాట్లపై ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. పుష్కరాలపై విస్తృత ప్రచారం కల్పించాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఘాట్ల ఏర్పాట్లు, శానిటేషన్ చర్యలు, మహిళలు బట్టలు మార్చుకునే సౌకర్యాల ఏర్పాటు, టూరిజం శాఖ ద్వారా ప్రత్యేక దర్శన ప్యాకేజీలు, హారతులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, రద్దీ నియంత్రణ చర్యలు, ఫైర్ సర్వీస్, అత్యవసర సేవలతో పాటు తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, వైద్యసేవల వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. అలాగే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు 5 కోట్లకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున దానికి తగిన విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు అనుగుణంగా త్వరలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందిస్తామని మంత్రి తెలిపారు. అలాగే నది పరివాహక ప్రాంతాల ఆలయాల అభివృద్ధి, పుష్కర ఘాట్‌ల్లో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం, జల ప్రసాదం, వసతి సౌకర్యాలు, పరిపాలనా సమన్వయం కోసం మంత్రుల బృందంతో ఇప్పటికే కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రి ఆనం తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ సెక్రటరీ హరి జవహర్ లాల్, దేవాదాయ శాఖ కమిషనర్ కే. రామచంద్ర మోహన్, చీఫ్ ఇంజనీర్ శేఖర్, స్థపతి బి. పరమేశ్వరప్ప, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఒకే చోట చేనేత, హస్తకళా రూపాలు, జీసీసీ ఉత్పత్తుల అమ్మకాలు

- విక్రయానికి వాణిజ్య సముదాయాల ఏర్పాటు
- దేశంలో తొలి విడతగా 5 ప్రధాన నగరాల్లో...
- ఏపీలో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో ఏర్పాటు
- వచ్చే నెల 20 నుంచి తిరుపతిలో చేనేత, హస్త కళల ఎగ్జిషన్
- 8 నుంచి లేపాక్షి వారోత్సవాలు
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడి



విజయవాడ (చైతన్యరథం): ఒకే చోట ఆప్కో, లేపాక్షి, జీసీసీ ఉత్పత్తులను విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. దీనిలో భాగంగా ఆప్కో, లేపాక్షి, అరకు కాఫీతో కూడిన జీసీసీ ఉత్పత్తుల వాణిజ్య సముదాయాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇటువంటి వాణిజ్య సముదాయాలను తొలి విడతగా దేశంలోని అయిదు ప్రధాన నగరాల్లో ఏర్పాటు చేయనున్నామన్నారు. దీనిలో భాగంగా ఏపీలో మూడు చోట్ల నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. రాబోయే ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తిరుపతిలో వచ్చే నెల 20 నుంచి చేనేత, హస్త కళల ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నామన్నారు. దేశ వ్యాప్త లేపాక్షి వారోత్సవాల్లో భాగంగా ఏపీలో వచ్చే నెల ఎనిమిదో తేదీ నుంచి 14వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడలోని ఓ హోటల్‌లో ఏపీ చేనేత, హస్తకళల అభివృద్ధి గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్లా, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖారాణి, లేపాక్షి ఎండీ విశ్వతో మంత్రి ఎస్.సవిత శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేతలకు, హస్త కళాకారులకు, గిరిజనులకు ఆర్థిక భరోసాతో కూడిన జీవనం అందించడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనిలో భాగంగా చేనేత, హస్త కళలు, అరకు కాఫీతో కూడిన జీసీసీ ఉత్పత్తులు ఒకే వాణిజ్య సముదాయంలో లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. ఈ మేరకు వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. తొలి విడతగా దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో ఇటువంటి వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

**20 నుంచి తిరుపతిలో ఎగ్జిబిషన్**

రాబోయే ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తిరుపతిలో చేనేత, హస్త కళల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఇప్పటికే విజయవాడ, గుంటూరు, రాజమండ్రిలో చేనేత, హస్త కళల ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎగ్జిబిషన్లకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా లక్షలాది మంది ప్రజలు తిరుపతికి తరలొస్తారన్నారు. ఈ ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని వచ్చే నెల 20 నుంచి జనవరి పదో తేదీ వరకూ 22 రోజుల పాటు చేనేత, హస్త కళల ఎగ్జిబిషన్ నిర్వహించనున్నామని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేపట్టాలని చేనేత, లేపాక్షి అధికారులను మంత్రి సవిత ఆదేశించారు.

**8 నుంచి లేపాక్షి వారోత్సవాలు**

వచ్చే నెల ఎనిమిదో తేదీ నుంచి దేశ వ్యాప్తంగా లేపాక్షి వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో లేపాక్షి ఉత్సవాలు నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. కడపలో జరిగే లేపాక్షి ఉత్సవాల్లో 11వ తేదీన తాను పాల్గొనబోతున్నట్లు మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రంలో నిర్వహించే లేపాక్షి వారోత్సవాలు ఘనంగా జరిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చేనేత, లేపాక్షి అధికారులు పాల్గొన్నారు.

# టీడీపీ కేంద్ర కార్యాలయంలో జ్యోతిరావుపూలే వర్ధంతి



అమరావతి (చైతన్యరథం): సంఘ సంస్కర్త, జ్యోతి మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమాన్ని మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, శ్రీశైలం బోర్డు మెంబర్ ఏవీ రమణ, నేతలు పర్చూరి కృష్ణ, బొద్దులూరి వెంకటేశ్వరరావు, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..జ్యోతిరావుపూలే చేసిన సేవలను, సామాజిక న్యాయం కోసం ఆయన పడిన తపనను కొనియాడారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు, మహిళల విద్యకు ఆయన అందించిన తోడ్పాటును స్మరించుకున్నారు.

# ఆముదాలవలస ప్రజాదర్బార్‌లో కూన రవి



ఆముదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గంలోని ఆముదాలవలస పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్‌ను ఆముదాలవలస శాసనసభ్యులు రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను, పలు శాఖలకు సంబంధించిన అభ్యర్థనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల వ్యక్తిగత సమస్యలు, గ్రామాభివృద్ధి, పథకాల అమలు, మౌలిక వసతుల పరిష్కారం వరకు వివిధ అంశాల పట్ల ప్రజలు అర్జీలు ఇచ్చారు. గ్రీవెన్స్‌లో ప్రజల అర్జీలను పరిశీలించి రవికుమార్... సంబంధిత అధికారులతో ప్రత్యక్షంగా మాట్లాడి తక్షణ పరిష్కారం కోసం ఆదేశాలు ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని, ఎవరూ ఇబ్బందులు పడకుండా ప్రజాదర్బార్‌లు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను వినిపించుకున్న ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**●రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్**



పాడేరు (చైతన్యరథం): అల్లూరి జిల్లాలోని పాడేరు మండలం గుత్తుల పుట్టు పంచాయతీలో 'రైతన్న మీకోసం' కార్యక్రమం టీడీపీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... ప్రతి రైతు ఆర్థికంగా ఎదగాలన్నదే చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని విశ్వసించే చంద్రబాబు రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. 'రైతన్న మీకోసం' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి పంటల ప్రయోజనాలు, రైతు ఆర్థిక అభివృద్ధికి చేయాల్సిన చర్యలను వివరించుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో నీటి భద్రత కోసం ప్రాజెక్టుల్లో నీటిని నింపే కార్యక్రమాలను వేగవంతం చేశామని, డిమాండ్ ఆధారిత పంటలైన రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా చేపట్టేందుకు రైతులకు తరిపి పంపిణీ జరుగుతోందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో భారీ పెట్టుబడులు రాబడుతున్నాయని, ఇప్పటికే సిఐఐ సదస్సులో 13 వేల కోట్ల పెట్టుబడులతో 38 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ఎంఓయూలు కుదిరాయని చెప్పారు. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసి వ్యవసాయ ఉత్పత్తుల విలువ పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పీఎం కిసాన్ పథకం కింద రెండు విడతల్లో 46,86,838 మంది రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి 14,000 చొప్పున మొత్తం రూ.63.10 కోట్ల సహాయం కూటమి ప్రభుత్వం అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే సమస్యలు పరిష్కారం

**● ప్రజలు నుండి వినతులు స్వీకరించిన ప్రభుత్వ విప్**



కురుపాం (చైతన్యరథం): ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం నాడు ఎమెల్యే క్యాంపు కార్యాలయం గుమ్మలక్ష్మీపురంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు అందించిన వినతులను స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. రహదారులు వేయాలని, త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థికసాయం అందించాలని, ఇళ్ళు స్థలాలు, పోడు పట్టాలు, తదితర సమస్యలపై ప్రజలు వినతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వచ్చిన వినతులపై సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులు కూడా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, మాజీ సమితి అధ్యక్షురాలు వెంపటాపు భారతి, నోంద్రుకోన సర్పంచ్ పత్తిక ముసురు, మాజీ ఎంపీపీ తాడంగి లక్ష్మణరావు, ఎంపిడిఓ లక్ష్మి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు తెలుసుకున్న పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్



పాతపట్నం (చైతన్యరథం): నియోజకవర్గం, మెలియాపుట్టి మండలంలో శుక్రవారం ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం "ప్రజాదర్బార్" నిర్వహించారు. నియోజకవర్గం రాజకీయ చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యే ఎంజీఆర్ ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల అన్ని వర్గాల ప్రజలు పార్టీలకు అతీతంగా పార్టీ రహితంగా "ప్రజా దర్బార్" నిర్వహించడం పట్ల ప్రజల నుండి హర్షితిరేఖాలు వ్యక్తమౌతున్నాయని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలు గాలికి విడిచిపెట్టడంతో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉన్నాయని అన్నారు. ఈ తరుణంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యే ఎంజీఆర్ కృషి పట్ల పలువురు అభినందించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులలో భూ వివాదాలు, రెవెన్యూలతోపాటు రహదారుల సమస్యలు, విద్యుత్ కోతలు, తాగునీటి సమస్యలు, ప్రధాన సమస్యలే ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. దీనితోపాటు రేషన్ కార్డులు కావాలని పింఛనులు కావాలని, ఇల్లు స్థలాలు కావాలని, గృహ నిర్మాణాలు చేపట్టాలని, వృద్ధులు వికలాంగులు, వితంతువులు వ్యక్తిగత ఫిర్యాదులు కూడా వచ్చాయి. గత పాలనలో పాలకులు, పాలనపై దృష్టి సాధించక సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోవడంతో ప్రభుత్వం మారడంతో స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వచ్చి అనేక సమస్యలు సామాజిక సాంఘిక సమస్యలపై స్పందించి ఫిర్యాదులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నరసన్నపేట ప్రజాదర్బార్‌కు విశేషస్పందన... అర్జీలు స్వీకరణ



నరసన్నపేట (చైతన్యరథం): పోలాకి మండలం, కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను, పలు శాఖలకు సంబంధించిన అభ్యర్థనలను ఎమ్మెల్యేకి తెలియజేశారు. ప్రజల వ్యక్తిగత సమస్యలు మరియు గ్రామాభివృద్ధి, పథకాల అమలు, మౌలిక వసతుల పరిష్కారం వరకు వివిధ అంశాల పట్ల అర్జీలు ఇచ్చారు. గ్రీవెన్స్‌లో ప్రజల అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులతో ప్రత్యక్షంగా మాట్లాడి తక్షణ పరిష్కారం కోసం ఆదేశాలు ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని, ఎవరూ ఇబ్బందులు పడకుండా ప్రజాదర్బార్‌లు నిరంతరం కొనసాగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను వినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే విజయచంద్ర




పార్వతీపురం (చైతన్యరథం): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే నా ఎజెండా అని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు వినతల రూపంలో అందించిన సమస్యలను పరిశీలించి వాటిలో తక్షణమే పరిష్కరించాల్సినవి అక్కడికక్కడే పరిష్కార మార్గాన్ని చూపారు. మరి కొన్ని సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. పార్వతీపురం నియోజవర్గంలో ఉన్న ప్రతి సమస్యను తక్షణ పురస్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఇప్పటికే పింఛన్లు, ఇల్లు, రోడ్లు, భూసమస్యలు, విద్యుత్ సమస్యలు, తదితర పలు సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ఈ ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుందని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రతీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం : మిరియాల శిరీష దేవి

**●ప్రజాదర్బార్‌కి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలి**



రంపచోడవరం (చైతన్యరథం): ప్రతి సమస్య ప్రాధాన్యత ప్రకారం పరిష్కారం చేసే దిశగా ముందుకు సాగుతున్నట్లు రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి స్పష్టం చేశారు. రాజవొమ్మంగి మండలం పరిషత్ అభివృద్ధి అధికారి ప్రాంగణంలో శు క్రవారం ఏపీఐఐసీ డైరెక్టర్, మండలం పార్టీ అధ్యక్షులు జి.పెద్దిరాజు అధ్యక్షతన ప్రజాదర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... ప్రజాసమస్యల పరిస్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియోజకవర్గాల్లో ప్రతీ శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా అందరూ డివిజన్ కేంద్రానికి రావాలంటే చాలా వ్యయప్రయాసలతో కూడిన పని కాబట్టి ప్రతీ మండలం కేంద్రంలో ఒక శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహణ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆయా సమావేశాల్లో అందిన ప్రతి దరఖాస్తును నమోదు చేసి వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. అలాగే నమోదు చేసిన ప్రతి అర్జీ ఏ శాఖకు చెందిందో ఆయా శాఖలకు సిఫార్సు చేయడంతో పాటూ ఎన్ని రోజుల్లో పరిష్కారం చేస్తారో కూడా తెలియజేసి పా రదర్శకంగా వ్యవస్థ నడిపిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ పరిష్కారం కానీ సమస్యలు ఉంటే ఎందుకు పరిష్కారం కావో వివరణాత్మకంగా అర్జీ దారునికి తెలియజేయాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. కొన్ని రకాల సమస్యల కొరకు ప్రభుత్వ యంత్రాంగం వద్ద లాగిన్ విడుదల చేసిన వెంటనే పరిష్కారం చేసేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కొన్ని సమస్యలు సంబంధిత అధికారులచే వెంటనే పరిష్కారం చేశారు. ప్రాముఖ్యంగా కుల ధ్రువీకరణ పత్రాలమంజూరు సమస్య ఆమె దృష్టికి తీసుకురాగా రెవిన్యూ అధికారులు ఆధారాలు ఉన్నవారుకి మంజూరు చేసేలా చూడాలని సూచించారు. మౌలిక వసతులు కల్పన కొరకు, భూ సంభంద సమస్యలైన మ్యూటేషన్ తదితర సమస్యలు, ఫింఛన్లు కొరకు ఇలా అనేక రకాల సమస్యలు ఆమె దృష్టిలో పెట్టగా చాలా మట్టుకు వెంటనే పరిష్కారించారు.

# ధాన్యం విక్రయించిన 48 గంటల్లో ఖాతాల్లో నగదు జమ



లావేరు (చైతన్యరథం): లావేరు మండలం పెద్దలింగాలవలసలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఈశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని తెలిపారు. ధాన్యాన్ని విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. లావేరు మండలంలో 20 రైతు సేవా కేంద్రాల పరిధిలో 9 ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

# సంక్షేమాభివృద్ధే మా ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే సత్యప్రభ



రౌతులపూడి (చైతన్యరథం): అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే సత్యప్రభ అన్నారు. శుక్రవారం దిగువ ధారపల్లి గ్రామం నుంచి టీకే రోడ్డు వరకూ చేపట్టిన రహదారి నిర్మాణానికి కూటమి నాయకులతో కలిసి వారు శంకుస్థాపన చేశారు. రహదారి అభివృద్ధికి పీఏం జన్మన్ నిధులు రూ.1.95 కోట్లు విడుదలైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి, టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తాం : ఎమ్మెల్యే గద్దె

- **సొంత స్థలంలో ఇల్లు నిర్మాణానికి రూ.2.50లక్షలు ఉచితంగా ఇస్తాం**



విజయవాడ (చైతన్యరథం): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం ఇంటిని మంజూరు చేస్తుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. సొంత ఇంటి స్థలం ఉండి అందులో ఇల్లు నిర్మాణం చేసుకునే వారికి రూ.2.50 లక్షలను ప్రభుత్వం ఉచితంగా అందచేస్తుందని, అవకాశం ఉన్నవారందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. శుక్రవారం ఉదయం అశోక్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై ప్రజల నుంచి వారి సమస్యల వినతి పత్రాలను స్వీకరించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి స్వయంగా సమస్యలపై వినతిపత్రాలు తీసుకుని వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖలు, విభాగాల అధికారులను ఆయన సూచించారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామమోహన్ స్థానిక నాయకులు, డివిజన్ ఇన్చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్‌ను నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేలను ఆదేశించారని తెలిపారు. గత రెండు వారాలుగా ఈ ప్రజాదర్బార్‌ను ఘనంగా నిర్వహించామని, మూడో శుక్రవారం నేడు నిర్వహిస్తున్నామన్నారు. అధికశాతం ప్రజలు తమకు ఇంటి స్థలం కేటాయించాలని కోరుతున్నారని చెబుతూ, 2029వ సంవత్సరం నాటికి రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరి సొంత ఇంటి కలను నేరువేరుస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని ప్రజలకు హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకుంటారనే విశ్వాసం తనకు పూర్తిగా ఉందన్నారు. తమకు ఇల్లు లేదా స్థలం కావాలని ఇప్పుడు ప్రజాదర్బార్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి దరఖాస్తును పరిశీలించి అర్హతలు ఉన్న వారికి స్థలం లేదా ఇంటిని ప్రభుత్వం అందచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ విభాగాల అధికారులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, డివిజన్ ఇన్చార్జిలు, స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయ యంగ్ ప్రొఫెషనల్ దుర్గా శాంతి, వారి సిబ్బంది, పెద్ద ఎత్తున ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే నేరుగా పాలన.... కోనయపాలెంలో ప్రజాదర్బార్



నందిగామ (చైతన్యరథం): చందర్లపాడు మండలం కోనయపాలెం గ్రామంలో శుక్రవారం నాడు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులు, కూటమి నేతలతో కలిసి పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా వినేందుకు, వెంటనే పరిష్కార దిశగా చర్యలు చేపట్టేందుకు ఈ ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ప్రతి సమస్యకు తక్షణ స్పందన ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అధికారులను నేరుగా ప్రజల వద్దకు తీసుకువస్తూ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని పేర్కొన్నారు. సామాన్య మానవుడు ఎక్కడ ఇబ్బంది పడకుండా, సులభంగా తన సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ అభివృద్ధి మరియు సంక్షేమాలను రెండు కళ్లుగా భావించి సమన్వయంతో పాలన సాగిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలసి నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వివరించారు. వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం, అడవి ఆవుల సమస్య, నియోజకవర్గంలోని వివిధ ఎత్తిపోతల పథకాలు, అలాగే రైతన్న పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం నారా చంద్రబాబునాయుడు దృష్టికి దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. వీటిపై అతి త్వరలోనే పురోగతి ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోటా వీరబాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ వాసిరెడ్డి ప్రసాద్, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్

- అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



మైలవరం (చైతన్యరథం): ప్రజాసమస్యల పరిష్కార వేదికగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. జి.కొండూరు మండల పరిషత్తు కమ్యూనిటీ హాల్లో ప్రజదర్బార్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి సమస్యలపై స్వయంగా ఆర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను విని వాటికి పరిష్కార మార్గాలను సూచించారు.ముందుగా మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఆ మహనీయుని సేవలను స్మరిస్తూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. పూలే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతోందన్నారు.

**ప్రజల నమ్మకాన్ని నిలబెడుతున్న కూటమి ప్రభుత్వం**

రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం నిలబెడుతుందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు, రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోడీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు.

**వచ్చేవారం మైలవరంలో ప్రజాదర్బారు.**

రెవెన్యూ శాఖ పరిధిలోని భూమికి సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తున్నందున వచ్చే వారం జిల్లా కలెక్టరును ఆహ్వానించి మైలవరంలో నియోజకవర్గ స్థాయిలో ప్రజాదర్బారు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**సమస్యలపై 86 ఆర్జీలు అందజేత**

మండల వ్యాప్తంగా ప్రజలు విచ్చేసి 86 మంది వివిధ సమస్యలపై ఆర్జీలు అందజేశారు. సంక్షేమ పథకాలు వర్తింపునకు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని, పంచాయతీ రాజ్, రెవెన్యూ, జలవనరుల శాఖ పరిధిలోని పలు సమస్యలపై ప్రజలు ఆర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన నిమ్మకాయల

పెద్దాపురం (చైతన్యరథం): నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రజా దర్బార్ సమావేశంలో పాల్గొని ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక రైతులతో సమావేశమై 'అన్నదాత సుఖీభవ' అంశంపై చర్చించి, ప్రతి రైతుకు కరపత్రం పంపిణీ చేస్తూ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసిన నిధుల వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మాజీ మున్సిపాలిటీ చైర్మన్ రాజా, సూరి బాబు రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజలకు చేరువగా సుపరిపాలన లక్ష్యంగా ప్రభుత్వ చొరవ

**●ప్రజాదర్బార్ వేళ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే యార్లగడ్డ**



గన్నవరం (చైతన్యరథం): ప్రజలకు చేరువగా సుపరిపాలన లక్ష్యంగా నియోజకవర్గ స్థాయిలోనూ ప్రజా సమస్యల ఫిర్యాదు వేదిక (పీజీఆర్ఎస్), ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని.. గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు యార్లగడ్డ వెంకటరావు తెలిపారు. శుక్రవారం విజయవాడ రూరల్, నున్నలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించగా.. గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకటరావు, కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 414 అర్జీలు వచ్చాయి. వీటిని నిర్దేశ గడువులోగా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో నియోజకవర్గాల స్థాయిలోనూ పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమాలతో పాటు షెడ్యూల్ ప్రకారం నియోజకవర్గ స్థాయిలోనూ నిర్వహిస్తున్నామని వివరించారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా నున్న గ్రామంలో అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించామన్నారు. అర్జీలు సమర్పించిన వారికి సంతృప్తికర పరిష్కారం చూపాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అంటరానితనాన్ని రూపుమాపేందుకు జీవితాంతం జ్యోతిరావుపూలే కృషి

● నివాళులర్పించిన టీడీపీ ఎమ్మెల్యే దేవినేని ఉమామహేశ్వరరావు



విజయవాడ (చైతన్యరథం): సామాన్యుడిగా మొదలై.. సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకొని గొల్లపూడి కార్యాలయంలో స్థానిక నేతలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ... సామాజిక కార్యకర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త పూలే భావి తరాలకు సైతం మార్గదర్శకుడని గుర్తు చేసుకున్నారు. సమాజంలో వివక్షకు తావు లేదని, సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడు పూలే అన్నారు. వెనుకబడిన వర్గాలు, దళిత జనోద్ధరణకు ఆయన ఎంచుకున్న బాట, అనుసరించిన మార్గం సమాజ శ్రేయస్సును కాంక్షించే వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమించిన సావిత్రిబాయి స్ఫూర్తి మనకు ఆదర్శమన్నారు. మహిళల జీవితాల్లో విప్లవాత్మకమైన చైతన్యం తీసుకువచ్చిన ధీశాలి సావిత్రిబాయి అని కొనియాడారు. తాను అనుకున్న లక్ష్య సాధన కోసం చివరి శ్వాస వరకు శ్రమించారని తెలిపారు.

## ప్రజల సమస్యే ప్రాధాన్యం
## ప్రజల మధ్యకే అడుగులు వేసిన చీఫ్ విప్ జీవీ

●సమస్యలు చెప్పండి... పరిష్కారం మా బాధ్యత... ప్రజలకు జీవీ హామీ



వినుకొండ (చైతన్యరథం): "ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందుబాటులోకి రావడమే మా ప్రధాన లక్ష్యం. మీ సమస్యలు చెప్పండి... పరిష్కారం మా బాధ్యత" అని హామీ ఇచ్చారు. "ప్రజా దర్బార్ ద్వారా ప్రజలతో నేరుగా మాట్లాడే వేదిక లభిస్తుంది. ఇక్కడ అందిన ప్రతి దరఖాస్తుపై వెంటనే చర్యలు ప్రారంభిస్తాం. నిర్దేశిత గడువులోగా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం" అని తెలిపారు. సమావేశంలో వచ్చిన అన్ని వినతులను వర్గీకరించి, సంబంధిత శాఖల అధికారులకు తక్షణమే పంపించాలని ఆయన కార్యాలయ సిబ్బందికి సూచించారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన కొన్ని అత్యవసర సమస్యలను ఆయనే అక్కడికక్కడే సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించి స్పాట్‌లో పరిష్కరించారు. "నిరంతరం మీ మధ్యనే ఉంటాను. మీ సమస్యలు పరిష్కరించడం నా నైతిక బాధ్యత. ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని నమ్మకం కలిగి ఉండండి" అని భరోసా కల్పించారు. "ఏ సమస్యా పెండింగ్‌లో ఉండకూడదు. మండల స్థాయి అధికారులు ప్రజలతో మరింత సమన్వయం పెంచి, ఫీల్డ్‌లోకి వెళ్లి సమస్యలను పరిశీలించాలి. నిర్దిష్ట గడువులోగా నివేదికలు అందించాలి" అని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. "ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి ఒక్క సమస్యకూ పరిష్కారం చూపడం మా మొదటి బాధ్యత. ప్రజలు ఇబ్బందులు పడకుండా, ప్రతి కేసును బాధ్యతగా తీసుకొని వెంటనే చర్యలు తీసుకోవాలి" అని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల మరియు పట్టణస్థాయి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్



విజయవాడ (చైతన్యరథం): నిత్యం తాము ప్రజల సమస్యల స్వీకరణ కొనసాగించడమే కాకుండా, ప్రతి శుక్రవారం నాడు ప్రత్యేకంగా ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదులు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం సెంట్రల్ నియోజకవర్గ 3వ ప్రజాదర్బార్‌కు పోటెత్తిన అర్జీదారులు, మొత్తం 1200 వినతులు అందగా అందులో 67% సమస్యలు వెంటనే పరిష్కరించగా, మిగిలినవి సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ త్వరితగతిన పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకున్నామని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 59వ డివిజన్ సింగ్ నగర్ సమీపంలో నివాసం ఉండే వృద్ధురాలు పీరు కట్ల సత్యవతి తనకు ఎవరూ లేరని మందులకు ఇబ్బంది పడుతున్నానని తెలియజేయగా మందుల ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## జగన్ పాపాల పాలన.. నేటికీ పేదల్ని శాపంలా పీడిస్తోంది

● గత అవినీతి మంత్రి డబ్బుకోసం చిలకలూరిపేటలో చేసిన పాపాలు ప్రజల్ని ఇప్పటికీ వేధిస్తున్నాయి

● ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): 167 ఏ జాతీయ రహదారి విస్తరణతో రైతులకు జరిగిన నష్టం గత పాలకుల పాపాల ఫలితమేనని, రోడ్ల కోసం భూములు, స్థలాలు, ఇళ్లు ఇచ్చిన వారికి అన్యాయం జరగడాన్ని సహించబోమని, అవసరమైతే టోల్ వసూలు కాలపరిమితి పెంచైనా రైతుల్ని ఆదుకోవాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (ప్రజాదర్బార్) నిర్వహించిన ప్రత్తిపాటి.. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడారు.

**గత ప్రభుత్వ అరాచకాలు, దోపిడీపైనే ఎక్కువ ఫిర్యాదులు..**

గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలు, దోపిడీపైనే ప్రజల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయన్న ప్రత్తిపాటి, టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాలను గత ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో సొంతింటి కోసం ప్రజలు దరఖాస్తులు ఇస్తున్నారన్నారు.

**జగన్ పాలన పేదలకు శాపంగా మారింది... పేదల పేరు చెప్పి జగన్ రాష్ట్రాన్నే కొల్లగొట్టాడు**

ఐదేళ్ల జగన్ పాలన పాపాలు పేదలకు శాపంగా మారాయని, పేదల పేరుచెప్పుకొని వారిని ఉద్ధరిస్తున్నట్టు ప్రజల్ని నమ్మించిన జగన్, రాష్ట్రాన్నే కొల్లగొట్టాడని దాని ఫలితమే కూటమి ప్రభుత్వంలో ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న సమస్యలని ప్రత్తిపాటి పేర్కొన్నారు. నియోజకవర్గంలో గతంలో ప్రాతినిధ్యం వహించిన మాజీ అవినీతి మంత్రి ధనార్జనే ధ్యేయంగా అక్రమ లేఅవుట్లను పెంచి పోషించారని, కేవలం భూములపై గీతలు గీసి ప్లాట్లు అమ్ము కొని వారి దారి వారు చూసుకున్నారని ప్రత్తిపాటి చెప్పారు.

**గత పాలకుల నిర్లక్ష్య ఫలితమే 167ఏ జాతీయ రహదారి రైతుల సమస్య..**

167 ఏ జాతీయ రహదారి విస్తరణ వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం గత ప్రభుత్వంలో పరిహారం నిర్ణయించలేదని, దాంతో వారు ఇప్పుడు న్యాయం చేయమంటున్నారని ప్రత్తిపాటి చెప్పారు. రైతులకు న్యాయం జరిగేలా, వారికి సంతృప్తికరమైన ధర ఇవ్వాలని, అవసరమైతే టోల్ ఛార్జీలు మరికొన్నాళ్లు పెంచుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. రైతుల సమస్యలపై కలెక్టర్‌తో మాట్లాడటం జరిగిందని, గతపాలకుల నిర్లక్ష్యంతో నష్టపోయిన రైతాంగానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

## ప్రజలకు మంచి చేసేందుకు గ్రామాల్లో ప్రజా దర్బార్:ఎమ్మెల్యే రాము



నందివాడ (చైతన్యరథం): గుడివాడ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. కూటమిపాలనలో నియోజకవర్గంలో మార్పు తీసుకొచ్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నానన్నారు. నందివాడ మండలం రామాపురం గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే రాము ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే రాము ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి... సమస్యలు తెలుసుకున్నారు. అర్జీలు అందించేందుకు రామాపురం పరిసర గ్రామాల ప్రజలు పోటెత్తారు. ప్రజల నుండి సమస్యల అర్జీలను ఎమ్మెల్యే రాము అందుకున్నారు. అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నారు. సాంకేతిక, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ప్రజలకు ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. గుడివాడ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే ముందస్తు ప్రణాళికతో గ్రామాల్లో ప్రజా వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వ పాలనలో, గుడివాడలోని అనేక అనేక గ్రామాల్లో త్రాగునీటి సమస్యను పరిష్కరించామని అన్నారు.ఆర్థికపరమైన అంశాలను త్వరగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జి బూర్రగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ రవికుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, సీతయ్య, సాల్మన్ రాజ్, సింగరాల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళల ఆరోగ్య భద్రతకు 'సఖి రక్ష - సఖి సురక్ష'

●గుంటూరు పశ్చిమలో 'సఖి రక్ష - సఖి సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 24వ డివిజన్ చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు, మెప్మా ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'సఖి రక్ష – సఖి సురక్ష' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... మహిళల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి డ్వాక్రా మహిళ ఆరోగ్య భద్రత కోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో, 35 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు, 55 ఏళ్ళు పైన వయసున్న మహిళలకు ప్రత్యేకంగా, మూడు రోజులపాటు విస్తృత స్థాయి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. క్యాన్సర్లు, రెస్పిరేటరీ సమస్యలు, షుగర్, లైఫ్ స్టైల్ డిసార్డర్స్, ఎనీమియా వంటి మహిళలు ఎక్కువగా ఎదుర్కొనే ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టి 14 రకాల ముఖ్యమైన హెల్త్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఒక వారం రోజుల్లో ప్రతి మహిళకు వ్యక్తిగత హెల్త్ కార్డు ఇచ్చి, ఏదైనా ఆరోగ్య సమస్యలు కనపడితే నేరుగా ప్రభుత్వం హాస్పిటల్‌కి రిఫర్ చేసి పూర్తి స్థాయి ఫాలోఅప్, చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అదే విధంగా ఆయుష్మాన్ భారత్ కింద ప్రతి మహిళకు ?5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం అందుబాటులో ఉండటం ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. డ్వాక్రా మహిళల స్వయం సాధికారత కోసం ఈ పథకం మరో భారీ అడుగుగా నిలుస్తుందని, ప్రతిరోజూ కనీసం 600 మందికి టెస్టులు – ట్రీట్మెంట్లు అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ఒక సంవత్సరం పాటు కొనసాగుతుందని, ఇప్పటికే సఖి సురక్ష టీంను ఏర్పాటు చేసే ప్రక్రియ మొదలైందని, టెస్టులు చేసిన ప్రతి మహిళకు పూర్తిస్థాయి చికిత్స అందించేందుకు ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

# పేదల బాగోగులే సీఎం చంద్రబాబుకు ముఖ్యం

**వింజమూరులో త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం, కొత్త భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కాకర్ల జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు**




వింజమూరు, (చైతన్యరథం): వింజమూరు మండల కేంద్రంలో కొత్తగా నిర్మాణం పూర్తిచేసుకున్న అన్నా క్యాంటీన్ భవనాన్ని ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుతో కలిసి స్వయంగా సందర్శించి, పరిశీలించారు. నిర్మాణ పనులు, వసతులు, ప్రజలకు అందించాల్సిన సేవలపై సమగ్రంగా అవగాహన తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రతి నియోజకవర్గంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేద ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలని సంకల్పం చేశారన్నారు. ఇందులో భాగంగా వింజమూరు ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని తక్కువ ధరలో అందించేందుకు అన్నా క్యాంటీన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అన్ని ఏర్పాట్లు వేగంగా పూర్తి చేస్తున్నామని, త్వరలో క్యాంటీన్‌ను ప్రజల సేవకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా పేదల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక ముఖ్యమైన అడుగు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యలపై అర్జీదారులనుంచి వినతులు స్వీకరించిన శాసన సభ్యులు అమరనాథ రెడ్డి

# సత్వరం ప్రజాసమస్యల పరిష్కారం

**ప్రజాదర్బార్‌లో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్**




పూతలపట్టు, (చైతన్యరథం): పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లి మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీ మోహన్ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ నిర్వహించారు. తవణంపల్లి మండలంతో పాటు నియోజకవర్గం ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభ్యర్థనలు ఎమ్మెల్యే కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకుంటాం. సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, వీలైనంత త్వరగా పరిష్కారం వచ్చేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. ప్రజలు పింఛన్లు, రవాణా సమస్యలు, రహదారులు, తాగునీరు, రేషన్, హౌసింగ్, ఆరోగ్య సేవలు వంటి పలు అంశాలపై అభ్యర్థనలు సమర్పించగా, ఎమ్మెల్యే గారు వాటిని నమోదు చేసి వెంటనే అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లి మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, ఏఎంసీ చైర్మన్ భాస్కర్ నాయుడు, మాజీ మండల అధ్యక్షులు దిలీప్ నాయుడు, క్లస్టర్ ఇన్చార్జులు మోహన్ నాయుడు, ప్రవీణ్, తవణంపల్లి, అరగొండ సింగల్ విండో అధ్యక్షులు అమరేంద్ర నాయుడు, రంజిత్ రెడ్డి,తవణంపల్లి స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబంధిత శాఖల అధికార సిబ్బంది పాల్గొన్నారు.

# బడుగుజీవుల ఆశాజ్యోతి పూలే

**ఘనంగా నివాళులు అర్పించిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు**

కందుకూరు, (చైతన్యరథం): టీడీపీ కార్యాలయంలో సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం మహాత్మా జ్యోతిరావు పూలే ం చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఒక గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక న్యాయ పితామహుడిగా చరిత్రలో నిలిచిపోయారు. పూలే ఆశయాల సాధనలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి కృషి చేశారని తెలిపార . జ్యోతిరావు పూలే చూపిన మార్గంలో పయనిస్తూ, సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు మరియు మహిళలందరూ ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. కందుకూరు నియోజకవర్గంలో కూడా సామాజిక న్యాయాన్ని సాధించడమే లక్ష్యంగా, టీడీపీ బలంగా, ఐక్యంగా పనిచేస్తుందని వారు ప్రకటించారు. పేద, వెనుకబడిన వర్గాలకు సాధికారత, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ళ రవిచంద్ర, ముచ్చు శ్రీనివాసరావు, చుండూరి శ్రీను, భవనాసి వెంకటేశ్వర్లు, గుమ్మా శివ, పసుపులేటి రమణయ్య, షేక్ సలాం, మధిర మధు, పీలా శ్రీనివాసరావు, చీదెళ్ళ పిచ్చయ్య, మచ్చా మనోహర్, చల్లా మహేంద్ర, నీలిశెట్టి శివరామకృష్ణ, నందికనమళ్ళ లక్ష్మణరావు, వెంకట్రావు, గుమ్మడి శివ, కంకణాల వెంకటేశ్వర్లు, కందల రాజశేఖర్, ఆత్మకూరి చంద్రశేఖర్, ఉప్పుగుండూరి రమేష్, సుబ్బరాజు పాల్గొన్నారు.

**కనిగిరి నియోజకవర్గం పీసీ పల్లి మండలం మురుగుమ్మి పంచాయతీకి చెందిన 11 కుటుంబాలు చేరడంతో ఎమ్మెల్యే డ్టార్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి, కసిరెడ్డి హనుమరెడ్డి, కసిరెడ్డి ఓబులురెడ్డి**





# టీడీపీ ఘనంగా జిల్లా కార్యాలయంలో పూలే వర్ధంతి

నెల్లూరు, (చైతన్యరథం): మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతిని పురస్కరించుకొని నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టిడిపి బీసీ నాయకులు మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల కోసం పూలే చేసిన సేవలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. విద్యా హక్కు, మహిళా సాధికారత కోసం పూలే ప్రారంభించిన ఉద్యమాలు దేశానికి కొత్త చైతన్యం ఇచ్చాయని గుర్తుచేశారు. యువత పూలే సిద్ధాంతాలను తెలుసుకుని సమాజంలో సమానత్వం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొండూరు పాల్శెట్టి, నన్నేసాహెబ్, పముజుల ప్రదీప్, ఉప్పు భాస్కర్, ఉప్పు కృష్ణ, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పుత్తూరు, నగరి పట్టణాల్లో త్వరలో రైతుబజార్లు

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు**



తిరుపతి, (చైతన్యరథం): నగరి నియోజకవర్గంలోని నగరి, పుత్తూరు మునిసిపాలిటీల్లో రైతు బజార్ల ఏర్పాటుకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు తెలిపారు. నగరి, పుత్తూరు పట్టణాల్లో రైతులకు, ప్రజలకు సౌకర్యంగా వుండేలా రైతు బజార్లు ఏర్పాటు చేయాలని ఆయన శుక్రవారం మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పట్టణాల్లోను కూరగాయలు పండించే రైతులకు సరైన గిట్టుబాటు ధరలు లభించటం లేదని తెలిపారు. అదే సమయంలో ప్రజలకు కూడా సరసమైన ధరలకు కూరగాయలు లభించడం లేదన్నారు. ఇరు వర్గాలకు న్యాయం జరగడం లేదని, దళారులు మాత్రం లాభపడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో తాను రెండు పట్టణాల్లోనూ రైతు బజార్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావించి స్వయంగా మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించానని తెలిపారు. తన అభ్యర్థన మేరకు మంత్రి స్పందించి వెంటనే పుత్తూరు, నగరి పట్టణాల్లో రైతు బజార్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారని విజయ్ బాబు తెలిపారు.



# కార్యకర్తల కంటతడి చూడలేని మంత్రి లోకేష్

## బీమా మంజూరు పత్రం పంపిణీలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వెల్లడి



కదిరి, (చైతన్యరథం): కార్యకర్త కుటుంబానికి కష్టం వస్తే తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వెల్లడించారు. కేవలం వంద రూపాయలతో 5లక్షల రూపాయల బీమా కల్పించిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. ప్రమాద బీమా పత్రం అందించిన సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో నల్లచెరువు మండలం కే పులకుంట గ్రామానికి చెందిన షేక్ షకీర్ మరణించారు. టీడీపీ సభ్యత్వం ఉండటంతో 5లక్షల బీమా మంజూరయ్యింది. దీనితో షేక్ షాకిర్ భార్య మస్తాన్ బీకి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బీమా మంజూరు పత్రం అందజేశారు. ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ సీఎం చంద్రబాబుకు మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబం కష్టంలో ఉన్న సమయంలో ఆదుకున్నారని షేక్ షాకీర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఏ నాయకుడు ఆలోచించని విధంగా నారా లోకేష్ ఆలోచించారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కార్యకర్తల మీద నారా లోకేష్‌కు ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. ఇలాంటి నాయకత్వంలో పని చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్,క్లస్టర్ ఇంచార్జీ గుత్తా ప్రసాద్, తెలుగుయువత నాయకులు సతీష్ చౌదరి, మైనార్టీ నాయకులు అబ్దుల్ పాల్గొన్నారు.

# రైతుల కళ్ళల్లో ఆనందమే సీఎంచంద్రబాబు ఆశయం

## ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ రఘునాథ్ రెడ్డి




పుట్టపర్తి, (చైతన్యరథం): రైతు కళ్ళలో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమనీ పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం సుమారు 140 మంది రైతులకు 280 బస్తాల యూరియాను నియోజవర్గ టీడీపీ బాధ్యులు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను గుర్తు పెట్టుకోవాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవసాయాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టారని గుర్తు చేశారు. రైతులకు అండగా నిలిచే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి సహకార సొసైటీ అధ్యక్షులు ముమ్మనేని వెంకటరాముడు, బ్యాంకు సీఈఓ రవిశంకర్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ధనవంతులను చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి వెల్లడి

మార్కాపురం, (చైతన్యరథం): కొనకనమిట్ల మండలంలోని పెదారికట్ల గ్రామంలో మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి గారి ఆధ్వర్యంలో" రైతన్న మీకోసం" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ అప్పటి వైసీపీ పాలకులు నూతన జిల్లాల ఏర్పాటులో ప్రకాశం పశ్చిమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. అప్పట్లో 63 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు,నిరాహార దీక్షలు నిర్వహించామని చివరకు పోలీసులను అడ్డుపెట్టి తమని అరెస్టు చేశారని గుర్తు చేశారు. పెద్దాయన నారా చంద్రబాబు నాయుడు మార్కాపురంలో తన పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న చోటే మార్కాపురం నూతన జిల్లాను ఇస్తామని హామీ ఇచ్చారని ఆ హామీకి కట్టుబడి ఇప్పుడు మార్కాపురం జిల్లా ప్రకటించారని ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ వారికి రుణపడి ఉంటారని అన్నారు. గత వైసిపి పాలకులు వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసామని కల్లబొల్లి కబుర్లు చెప్పి ప్రాజెక్టును ప్రారంభించారని ఈ ప్రాంత ప్రజలను తీవ్రంగా మోసం చేశారని అన్నారు. వచ్చే ఏడాదిలోపు మార్కాపురం ప్రాంతానికి వలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు అందిస్తామని అన్నారు. అదేవిధంగా ఈ కొనకనమిట్ల మండలంలో సుమారు మూడు వేల కోట్ల రూపాయలతో రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మిస్తున్నామని త్వరలో వందలాది మందికి ఉద్యోగ కల్పన జరుగుతుందని అన్నారు. రైతులు పంట మార్పిడి పద్ధతులు అనుసరించి వ్యవసాయం చేయాలని తమ పంట ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు అమ్మాలని సూచించారు. మార్కాపురం జిల్లా ప్రకటించినందుకు కృతజ్ఞతగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి తెలుగుదేశం నాయకులు రైతులు పాలాభిషేకం చేశారు.




యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు. ముఖ్యమంత్రి సహానిధి ద్వారా 21 మందికి 20,92,730 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు.




# తీరు మార్చుకోకపోతే తాటతీస్తాం

## వైసీపీ నేతలకు రామగిరి మండల టీడీపీ నాయకుల హెచ్చరిక

రాప్తాడు, చైతన్యరథం): నియోజకవర్గంలో ఏ ఇంట్లో గొడవ జరిగినా.. ఎవరు వ్యక్తిగతంగా గొడవ పడ్డా దానిని పరిటాల సునీతకు ఆపాదిస్తున్నారని రామగిరి మండల టీడీపీ నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ కరపత్రిక (సాక్షి) లో వచ్చిన కథనం మీద వారు తీవ్రంగా స్పందించారు. మంగాపురంలో అంగన్వాడీ హెల్పర్ ఇంద్రజపై దాడి చేశారని.. ఆమెను రాజీనామా చేయాలని టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారంటూ చేసిన ఆరోపణల మీద వారు ఘాటుగా స్పందించారు. గ్రామంలో గొల్ల ఇంద్రజ, గొల్ల శ్రీనివాసులు కుమారుడు గొల్ల విష్ణు కుటుంబానికి మధ్య వ్యక్తిగత గొడవలు ఉన్నాయన్నారు. ఇటీవల రెండు కుటుంబాల వారు గొడవలు పడ్డారన్నారు. అయితే ఇదంతా టీడీపీ నాయకులు అంగన్వాడీ హెల్పర్ పోస్టు కోసం చేశారని.. సాక్షిలో కథనం వండి వార్చారన్నారు. పైగా దీనిని మహిళపై జరిగిన దాడిగా ఎలా చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి దానిని ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారుడు శ్రీరామ్‌కు అంటగడుతూ దుష్ప్రచారం చేయడం పరిపాటిగా మారిందన్నారు. గతంలో కూడా ఏడుగుర్రాలపల్లిలో ఒక దళిత బాలికపై దారుణం జరిగితే.. దానిని కూడా పరిటాల సునీత వర్గీయులంటూ విష ప్రచారం చేశారన్నారు. ఆ బాలిక కుటుంబంపై గత వైసీపీ ప్రభుత్వం నుంచే దాడి జరిగిందన్నారు. ఈ కేసులో పోలీసులు నిందితులందర్నీ అరెస్ట్ చేశారన్నారు. ప్రకాష్ రెడ్డి సోదరులు గత ఐదేళ్ల దుర్మార్గాలను ప్రజలెవరూ మర్చిపోలేదన్నారు. ప్రకాష్ రెడ్డి విష ప్రచారాలను మానుకోకపేతే మీకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.




జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భూపేష్ సుబ్బరామిరెడ్డి

# సమస్యల సత్వర పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

## ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు

ఒంగోలు, (చైతన్యరథం): ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు. ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని, వారి నుండి నేరుగా వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శు క్రవారం ఆయన నివాసంలోని నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతులను ఎమ్మెల్యేకు తెలియజేశారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, రుణాల మంజూరు, వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు, గ్రామాభివృద్ధికి సంబంధించి ఎదురవుతున్న ఇబ్బందులపై వచ్చిన విజ్ఞప్తులను ఎమ్మెల్యే గారు స్వయంగా స్వీకరించి వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులను పిలిచి ప్రత్యక్షంగా ఆదేశాలు జారీ చేసి, ప్రజలకు త్వరితగతిన పరిష్కారం అందేలా చర్యలు తీసుకున్నారు.



# నయా భారత్.. బెదిరింపులకు తలొగ్గదు!

## ఉడిపి శ్రీకృష్ణమఠంలో ప్రధాని మోదీ ఉద్ఘాటన



నయా భారత్ ఎలాంటి బెదిరింపులకు తలొగ్గదని, పౌరుల రక్షణ కోసం ఎంత దూరమైనా వెళ్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. కర్ణాటక పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ శుక్రవారం ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొని గీతా పారాయణం చేశారు. అనంతరం భక్తులు, గాయకులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు."గీతలో శ్రీకృష్ణుడి బోధనలు ప్రతి యుగానికి సంబంధించినవి మన జాతీయ విధానాన్ని అవి నిర్దేశిస్తాయి. ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని కృష్ణుడు బోధించాడు. 'సబీకా సాథ్, సబీ కా వికాస్', 'సర్వజన హితయ' అనే నినాదాలు గీత నుంచి స్ఫూర్తి పొందినవే మహిళల రక్షణపై శ్రీ కృష్ణుడి సందేశమే... రిజర్వేషన్ల చట్టానికి మార్గనిర్దేశనం, శాంతి, సత్యాన్ని సాధించడం కోసం అవసరమైతే దురాగతాలకు పాల్పడే వారిని అణచివేయాలని గీత మనకు బోధిస్తుంది" అని మోదీ పేర్కొన్నారు. "గతంలో ఉగ్రదాడులు జరిగినప్పుడు అప్పటి ప్రభుత్వాలు ఏమీ చేయకుండా చూస్తుందిపోయాయి. కానీ, నయా భారత్ అలా కాదు ఎవరి ముందు తలవంచదు. దేశ రక్షణ విషయంలో ఎన్నటికీ వెనుకడుగు వేయదు. ఆపరేషన్ సిందూర్లో మన సంకల్పాన్ని ప్రపంచం చూసింది. మన మిషన్ దేశానికి సుదర్శన చక్ర భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గతంలో ప్రధాని తెలిపిన సంగతి తెలిసిందే. రాబోయే పదేళ్లలో దేశంలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా పూర్తిస్థాయి సురక్షా కవచం ఏర్పాటు చేయడమే ఈ మిషన్ ఉద్దేశం. సుదర్శన చక్రం శత్రువులను నాశనం చేస్తుంది" అని మోదీ వెల్లడించారు.



# ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన

## శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రధాని మోదీ

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన శ్రీరాముడి విగ్రహాన్ని ప్రధాని మోదీ శుక్రవారం ఆవిష్కరించారు. దక్షిణ గోవాలోని 'శ్రీ సంస్థాన్ గోకర్ణ పర్తగాలీ జీవోత్తమ్ మఠం'లో 77 అడుగుల ఈ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా మోదీ అక్కడ పర్యటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు, సీఎం ప్రమోద్ సావంత్, పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ ఈ మఠంలో ఉన్న ఆలయాన్ని కూడా దర్శించారు. ఈ మఠం భారతదేశంలోనే అతి పురాతన మత సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. గుజరాత్లో ఉన్న 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ'ని తీర్చిదిద్దిన శిల్పి రామ్ సుతార్ శ్రీరాముడి విగ్రహాన్ని కూడా తయారు చేశారని వెల్లడించారు.

# ఉగ్రముఠాలో నరహంతక వైద్యులు

## అలఫలా యూనివర్సిటీలో జల్లెడపడుతున్న ఎన్ఐఏ

దిల్లీ పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో భాగస్వామి అయిన డాక్టర్ షాహీన్ను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సీన్ రీక్రియేషన్ కోసం నిందితులతో సంబంధమున్న అల్-ఫలా విశ్వవిద్యాలయానికి తీసుకువెళ్లారు. ఉగ్రకుట్ర దర్యాప్తులో భాగంగా ఈ కేసులో అరెస్టు చేసిన ఏడుగురు నిందితులను లఖ్నవూ, కాన్పూర్, సహరన్పూర్, ఫరీదాబాద్, జమ్మూకశ్మీర్ కు తీసుకువెళ్లనున్నట్లు తెలుస్తోంది. అల్-ఫలాలో దర్యాప్తు తర్వాత తదుపరి విచారణ కోసం షాహిన్ను లఖనవూ కాన్పూర్లకు తీసుకువెళ్లనున్నారు. అనుమానితులకు ఆయా ప్రదేశాల్లోని వ్యక్తులతో ఉన్న పరిచయాలు, ఎవరెవరు వారికి సహకరించారు. అనే విషయాలను తెలుసుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఉగ్ర నెట్వర్క్తో మరికొందరు వైద్యులకు కూడా సంబంధాలు ఉండే అవకాశం! ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఉగ్ర మాడ్యూల్ అసుపత్రులు, క్లినిక్ ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తోందని సహాయం కోసం విద్యావంతులైన వ్యక్తులను నియమించుకుంటున్నట్లు గుర్తించామన్నారు. ఫరీదాబాద్ మాడ్యూల్తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఎన్ఐఏ అధికారులు, డాక్టర్ షాహిన్. సహా ఏడుగురిని అరెస్టు చేశారు. తామంతా కలిసి దాదాపు రెండేళ్ల నుంచి అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలను సేకరిస్తున్నట్లు ఆమె అంగీకరించింది. వీటిని ఉపయోగించి పాకిస్థాన్కు చెందిన జైషే ఉగ్ర సంస్థ కోసం దేశవ్యాప్తంగా దాడులు చేసేందుకు సన్నాహాలు చేసినట్లు తెలిపింది. విచారణలో భాగంగా డాక్టర్ షాహిన్ తన భార్య అని సహ నిందితుడు ముజమ్మిల్ షకీల్ పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆల్- ఫలా యూనివర్సిటీ సమీపంలోని మతపరమైన ప్రదేశంలో వారి వివాహం జరిగినట్లు తెలిపాడన్నారు. భారత్లో మహిళా బ్రిగేడ్ల ఏర్పాటుకు షాహిన్ ఆన్లైన్ కోర్సులు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు ఇప్పటికే గుర్తించడంతో అల్-ఫలాలోని ఇతర మహిళా వైద్యులను కూడా ఆమె ప్రభావితం చేసి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

# కరోనా నేర్పిన కఠోర పాఠం

## చేపల వ్యాపారిగా మారిన ఎలక్ట్రికల్ ఇంజనీరు

కాలం విన్యాసాల్లో కొన్నిసార్లు మన జీవిత గమ్యాలు, ప్రాదమ్యాలు మారిపోతుంటాయి. మధ్యప్రదేశ్లోని అనూప్పుర్ జిల్లా రామనగర్ డోలాకు చెందిన పవన్కుమార్ షా ఎలక్ట్రికల్ ఇంజనీరింగు చదివి భోపాల్లో రెండేళ్లు ఉద్యోగం చేశారు. అయిదేళ్ల కిందట.. కరోనా లాక్ డౌనులో ఇంటికి తిరిగి రావాల్సి వచ్చింది. ఈ సమయంలో ప్రత్యామ్నాయ ఉపాధి వేట సాగించి చేపల. పెంపకంతో సొంత స్టార్టప నకు ఆయన శ్రీకారం చుట్టారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన పవన్ మూతబడి ఉన్న ఓ బొగ్గుగనిని ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకొని కేజ్ కల్చర్ ద్వారా చేపల పెంపకం ప్రారంభించారు. మార్కెట్ స్థితిగతులను అధ్యయనం చేశాక.. బతికున్న చేపలను (లైవ్ ఫిష్) అందుబాటులోకి తేవడం ద్వారా వినియోగదారులను ఆకట్టుకున్నారు. క్రమంగా వ్యాపారం ఇరుగు పొరుగు జిల్లాలకు.. యూపీకి, చత్తీస్ గడక్కు సైతం విస్తరించింది. నత్తల ఉత్పత్తి కూడా తోడై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 30 మందికి పవన్ ఉపాధి కల్పిస్తున్నారు. చేపల పెంపకంలో ఇప్పుడు ఇతర రైతులకు శిక్షణ ఇస్తూ సీడ్ ఏజెన్సీ ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారు.

# భారత న్యాయ నిపుణుడికి అంతర్జాయ గౌరవం

## పాలస్తీనా, ఇజ్రాయెల్ వివాదంపై విచారణ బందానికి నాయకత్వ బాధ్యతలు



ఒడిశా మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ మురళీధర్కు అరుదైన గౌరవం దక్కింది. ఇజ్రాయెల్, పాలస్తీనా వివాదంలో మానవహక్కుల ఉల్లంఘనపై విచారణ జరిపేందుకు ఏర్పాటు చేసిన కీలక ప్యానెల్కు ఆయన నేతృత్వం వహించనున్నారు. ఇజ్రాయెల్, గాజా ఉద్రిక్తతలను ప్రపంచం మొత్తం ఆసక్తిగా చూస్తున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసిన ఒక మానవ హక్కుల బృందానికి భారతీయ న్యాయమూర్తి నేతృత్వం వహించడం విశేషం. ఇజ్రాయెల్, ఆక్రమిత పాలస్తీనా ప్రాంతం'లో మానవ హక్కుల ఉల్లంఘనలపై విచారణ జరపడం ఈ ప్యానెల్ ప్రధాన బాధ్యత. ఈ స్వతంత్ర అంతర్జాతీయ విచారణా కమిషన్కు గతంలో బ్రెజిల్ న్యాయనిపుణుడు పాలో సెర్గియో పినీరో నేతృత్వం వహించారు. ఇజ్రాయెల్, పాలస్తీనా సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న వేళ జస్టిస్ మురళీధర్ ఇవ్వబోయే నివేదికలకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. కీలక తీర్పులు, ప్రగతిశీల ఆలోచనలతో జస్టిస్ మురళీధర్ గుర్తింపు పొందారు. 1984లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. తర్వాత ఢిల్లీ హైకోర్టుకు మారారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేశారు. జాతీయ మానవ హక్కుల కమిషన్లోనూ సేవలు అందించారు. 2006లో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021లో ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. స్వలింగ సంపర్కం నేరం కాదని ప్రకటించడం ఆయన ఇచ్చిన తీర్పుల్లో ముఖ్యమైంది. అయితే. 2013లో సుప్రీంకోర్టు దీన్ని రద్దు చేసింది. 2023లో పదవీ విరమణ చేసిన తర్వాత మురళీధర్ మళ్లీ న్యాయవాద వృత్తిని చేపట్టారు.

# అంగారక బిలాలకు కేరళ పట్టణాల పేర్లు

## ఇంటర్నేషనల్ ఆస్ట్రోనామికల్ యూనియన్ ఆమోదం

ఇంటర్నేషనల్ ఆస్ట్రోనామికల్ యూనియన్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. అంగారక గ్రహంపై ఉన్న బిలాలకు కేరళలోని పలు పట్టణాల పేర్లు పెట్టేందుకు ఆమోదం తెలిపింది. అంగారక గ్రహంలోని క్సాంతే టెర్రా ప్రాంతంలో 3.5 బిలియన్ సంవత్సరాల నాటి బిలాలను కనుగొన్నారు. వీటికి భారత భూవిజ్ఞాన శాస్త్రవేత్త ఎంఎస్ కృష్ణన్ గౌరవార్థం ఆయన పేరు పెట్టాలని కేరళ ఖగోళ పరిశోధకులు ఆసిఫ్ ఇక్బాల్ కక్క స్సేరి, రాజేశ్ వీజేలు ప్రతిపాదించారు. మరికొన్నింటికి కేరళకు చెందిన పెరియార్, వలియామల, తుంబ, వర్కల, బెకల్ తదితర పట్టణాల పేర్లను ప్రతిపాదించారు. వీటికి తాజాగా బఏయూ ఆమోదం తెలిపింది. దీని ప్రకారం బిలాల్లోని నీరు మంచుజాడలు కన్పించిన వాటిని ఇక నుంచి కృష్ణన్ క్రేటర్, కృష్ణన్ పాలస్, పెరియార్ వల్లిస్ అని పిలుస్తారు. మిగిలినవాటికి వలియామల(ఐఐఎస్టీ ప్రధాన కార్యాలయం), తుంబా (1960లో ఇస్రో స్థాపించిన స్థలం), వర్కల (ప్రత్యేకమైన కొండలు), బెకల్ (చారిత్రాత్మక కోట), పెరియార్ (కేరళలో అతి పొడవైన నది)గా వ్యవహరిస్తారు. ఎంఎస్ కృష్ణన్ 1888లో తంజావురులో జన్మించారు. జియోలాజికల్ సర్వేఆఫ్ ఇండియాకు తొలి డైరెక్టర్గా పని చేశారు. ఇక, గతేడాది అంగారక గ్రహంపై మూడు బిలాలను కనుగొన్నారు. వాటిల్లో ఒకదానికి దివంగత, ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త దేవేంద్రలాల్ పేరు పెట్టారు. మిగిలినవాటికి ఉత్తర్ ప్రదేశ్లోని ముర్సాన్ పట్టణం, ఖజహార్లోని హిల్సా టౌన్ పేర్లను పెట్టారు.



# భారత్‌కు రానున్న పుతిన్



- 4-5 తేదీల్లో రెండురోజుల పర్యటన
- భారత్‌తో కీలక ఒప్పందాలకు అవకాశం

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. డిసెంబరు 4-5 తేదీల్లో ఆయన భారత్‌లో పర్యటించనున్నారు. ఈమేరకు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు అమలు చేస్తోన్నవేళ పుతిన్ రాక ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాని నరేంద్రమోదీ ఆహ్వానం మేరకు ఆయన మన దేశంలో రెండు రోజులపాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మోదీ-పుతిన్ ద్వైపాక్షికంగా భేటీ అవుతారు. ఆయన గౌరవార్థం భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రత్యేక విందు ఇవ్వనున్నారు. పుతిన్ పర్యటనలో భాగంగా ఇరుదేశాల మధ్య పలు ఒప్పందాలు జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రష్యా ఆర్థిక వ్యవస్థకు పునాదులైన భవన నిర్మాణం, జౌళి, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో నిపుణుల కొరత ఉంది. ఈ క్రమంలో 70వేల మందికి పైగా భారతీయ కార్మికులు, నిపుణులకు రష్యాలో ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. ఈమేరకు రెండు దేశాలు ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం.

2021 తర్వాత పుతిన్ భారత్‌కు రావడం మళ్లీ ఇప్పుడే. గతేడాది ప్రధాని మోదీ, పుతిన్ రెండుసార్లు భేటీ అయ్యారు. 2024 జులైలో ఇరుదేశాల శిఖరాగ్ర సమావేశంలో భాగంగా ప్రధాని మోదీ రష్యాకు వెళ్లారు. ఆ సందర్భంలో మోదీ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆంద్రూ ది అపోస్టల్' అందుకున్నారు. అదే ఏడాది అక్టోబర్‌లో బ్రిక్స్ సదస్సు సందర్భంగా రష్యాలోని కజాన్లో వీరిద్దరూ మరోసారి భేటీ అయ్యారు. ఇక, ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో పుతిన్-మోదీ భేటీ అయి పలు అంశాలపై చర్చించిన సంగతి తెలిసిందే.

# భూభాగంనుంచే కొడతాం



- వెనుజువెలాకు అమెరికా అధ్యక్షుడు వార్నింగ్
- త్వరలోనే ఆపరేషన్లు ప్రారంభిస్తామని హెచ్చరిక

వెనెజువెలాకు చెందిన మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నెట్వర్క్‌లపై చర్యలు తీసుకోవడానికి అమెరికా సిద్ధమైనట్టు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అతి త్వరలో వెనెజువెలా భూభాగంలో ఆపరేషన్లు చేపడతామన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి సముద్రం మీదుగా ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోతోందని.. దీంతో వాటిని ఆపడానికి భూభాగంపై నుంచే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికైనా తమ దేశంలోకి మాదక ద్రవ్యాలు సరఫరా చేయడాన్ని ఆపాలని వెనెజువెలాను మరోసారి హెచ్చరించారు. అమెరికా ఇప్పటికే కరేబియన్ సముద్రంలో భారీగా బలగాలు, యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్ జెట్లను మోహరించింది. అమెరికా దళాలు జరిపిన దాడుల్లో 80మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. తాజాగా ట్రంప్ చేసిన ప్రకటనతో.. ఏ క్షణమైనా అగ్రరాజ్యం వెనెజువెలా భూభాగంపై దాడి చేసే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెనెజువెలాలో అమెరికా దళాలు చొరబడొచ్చని ప్రచారం జరుగుతోంది. వెనెజువెలా ముఠాల నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటి నుంచి చెబుతున్నారు. తాజాగా ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనికదళాలను రంగంలోకి దింపారు. ఈ ముఠాలతో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని ట్రంప్ ఇటీవల స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. మదురో ఎన్నికను అమెరికా గుర్తించడం లేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ వెల్లడించారు. దీంతో అక్కడ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం కూడా ట్రంప్ కార్యవర్గానికి ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు వెనెజువెలాలోని చమురు రిజర్వులను స్వాధీనం చేసుకోవడానికే అమెరికా ఈ చర్యలు చేపడుతోందని వార్తలు ప్రచారం అవుతున్నాయి.

# మరో బాంబు పేల్చిన ట్రంప్

**పేద దేశాల నుంచి వలసలు పూర్తిగా నిలిపివేత**

అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం సమీపంలో కాల్పుల ఘటన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పేద దేశాలనుంచి అగ్రరాజ్యానికి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తామని ప్రకటించారు. దీనిపై ఇప్పటికే అమెరికా యంత్రాంగం చర్యలు ప్రారంభించినట్టు తెలిపారు. మరోవైపు, వలసదారులకు అన్నిరకాల ప్రభుత్వ సబ్సిడీలు, ఫెడరల్ బెనిఫిట్లను నిలివేస్తున్నట్టు ట్రంప్ వెల్లడించారు. "మనం సాంకేతికంగా ముందుకెళ్తున్నప్పటికీ.. ఇమిగ్రేషన్ విధానం ఆ ప్రయోజనాలను దెబ్బతీస్తోంది. అందుకే.. అమెరికా వ్యవస్థ పూర్తిగా కోలుకునేందుకు వీలుగా.. థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తున్నా. జో బైడెన్ ఆటో పెన్ సంతకం చేసిన లక్షలమంది అక్రమ అడ్మిషన్లను రద్దు చేయనున్నాం. అమెరికాకు ఆస్తికాని, మన దేశాన్ని ప్రేమించని వ్యక్తులను ఇక్కడినుంచి పంపించేస్తాం. అమెరికాయేతర పౌరులందరికీ ఫెడరల్ ప్రయోజనాలు, సబ్సిడీలను నిలిపివేస్తాం. దేశ ప్రశాంతతకు భంగం కలిగించే, మన భద్రతకు ముప్పుగా మారే వారిని బహిష్కరిస్తాం. తిరోగమన వలస విధానంతోనే ఈ లక్ష్యాలను సాధించగలం" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో రాసుకొచ్చారు.

శ్వేత సౌధానికి రెండు బ్లాకుల దూరంలో బుధవారం మధ్యాహ్నం కాల్పులు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నేషనల్ గార్డుకు చెందిన సభ్యురాలు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు గాయపడ్డారు. నిందితుడిని అఫ్గాన్‌కు చెందిన రెహ్మనుల్లా లకన్వాలాగా గుర్తించారు. సీఐఏ మద్దతున్న అఫ్గాన్ ప్రత్యేక సైనిక విభాగంలో అతడు కొన్నాళ్లు పనిచేసి అమెరికాకు వలస వచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ వలసలపై తాజా నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు.. అఫ్గాన్‌తో సహా మరో 18 దేశాలకు చెందిన గ్రీన్ కార్డ్ హోల్డర్లను అధికారులు సమీక్షించనున్నారు.

పేద, అభివృద్ధి అంతగాలేని దేశాలను థర్డ్ వరల్డ్ కంట్రీస్‌గా పిలిచేవారు. దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలోని అనేక దేశాలు, దక్షిణ సూడాన్, సోమాలియా, నైగర్, బుర్కినా ఫాసో, బురుండి, అఫ్గానిస్థాన్, మడగాస్కర్, ఇథియోపియా, లైబీరియా, పాకిస్థాన్, సిరియా, ఉగాండావంటి దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి.



# చివురుటాకులా శ్రీలంక!

- ద్విత్వాతో భారీ వర్షాలు, వరదలు
- 56మంది మృతి.. వందలాది ఇళ్లు నేలమట్టం
- మానవతా దృక్పథంతో భారత్ 'సాగర్ బంధు'

ద్విత్వా తుపాను కారణంగా భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో శ్రీలంక అల్లాడుతోంది. అనేకచోట్ల కొండచరియలు విరిగిపడడంతో 56మంది మరణించినట్టు ప్రభుత్వ విపత్తు నిర్వహణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరో 21మంది గల్లంతయ్యారు. వరద ధాటికి 600కి పైగా ఇళ్లు, పాఠశాలలు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కొట్టుకుపోయాయి. అనేక రహదారులు, పొలాలు జల దిగ్బంధమయ్యాయి. వరదల్లో గల్లంతైన వారికోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ఆపరేషన్ కొనసాగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. దేశంలోని అనేక నగరాలు వరదలో చిక్కుకుపోవడంతో శ్రీలంక ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను మూసివేసింది. రైలు సర్వీసులు నిలిపివేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలు, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. దేశంలోని మరిన్ని ప్రాంతాలకు భారీ వర్ష ముప్పు ఉన్నట్టు స్థానిక వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది.

**భారత్‌నుంచి 'ఆపరేషన్ సాగర్ బంధు'**

శ్రీలంకలో సంభవించిన వరదల్లో దాదాపు 56మంది ప్రాణాలు కోల్పోవడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. కష్ట సమయంలో పొరుగు దేశానికి స్నేహ హస్తం అందించేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో అత్యవసర మానవతా సాయం పంపినట్టు ప్రకటించారు.

# పెరుగుతున్న ప్రాణనష్టం

- హాంకాంగ్ అగ్నిప్రమాదంలో 128మంది సజీవ దహనం
- మరింత పెరగొచ్చని అంచనా వేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

హాంకాంగ్ ఆకాశహర్మ్య అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య పెరుగుతోంది. దుర్ఘటనలో ఇప్పటివరకు 128మంది ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఇంకా 200మందికిపైగా ఆచూకీ దొరకడం లేదు. ఏడు భవంతుల హౌసింగ్ కాంప్లెక్స్‌లో చెలరేగిన అగ్నికీలలను అధికారులు అత్యధికంగా శ్రమించి ఆర్పివేశారు. చివరి ప్రయత్నంగా.. అగ్నిమాపక సిబ్బంది ఒక్కో అపార్ట్‌మెంట్‌లో వరుసగా ముమ్మర తనిఖీలు చేపట్టారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. బుధవారం మధ్యాహ్నం ఘటన చేసుకుంది. ఒక భవన సముదాయంలో చెలరేగిన మంటలు క్షణాల్లో మిగతా టవర్లకు వ్యాపించడం తెలిసిందే. దాదాపు 1000మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది 24 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఇప్పటికీ కొన్ని భవనాల నుంచి పొగ వెలువడుతూనే ఉంది. ఈ భవంతుల మరమ్మతుల సందర్భంగా కిటికీల వద్ద ఏర్పాటుచేసిన పాలిస్టైరైన్ బోర్డులవల్లే మంటల తీవ్రత పెరిగినట్టు అధికారులు భావిస్తున్నారు. దీనికితోడు మరమ్మతు పనుల కోసం ఏర్పాటు చేసిన వెదురు బొంగులు, నిర్మాణ మెష్ కూడా మంటలు వ్యాప్తికి కారణంగా కనిపిస్తోంది.





# థాయిలాండ్‌లో వరద బీభత్సం

***145మంది దుర్మరణం.. 12 లక్షల ఇళ్లు నేలమట్టం***

గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దక్షిణ థాయిలాండ్‌ను వరదలు ముంచెత్తుతున్నాయి. తీవ్ర వరదల కారణంగా ఇప్పటి వరకు 145మంది ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు చెబుతున్నారు. అనూహ్య వరదలకు 12 లక్షలకు పైగా ఇళ్లు దెబ్బతిన్నాయని.. అనేకమంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్స్ నడుస్తున్నాయి. వరదల్లో చిక్కుకున్న ప్రజలను భద్రతా బలగాలు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. శిథిలాల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రహదారులవంటి మౌలిక సౌకర్యాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

# INDIA V SRI LANKA మహిళల టీ20 సిరీస్ షెడ్యూల్ విడుదల

భారత మహిళల జట్టు ఇటీవలే వన్డే వరల్డ్ కప్ నెగ్గి విశ్వవిజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ టోర్నీ అనంతరం టీమిండియా తొలిసారిగా శ్రీలంకతో అయిదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. నిజానికి బంగ్లాదేశ్‌తో డిసెంబర్‌లో టీమిండియా మూడు టీ20ల సిరీస్ ఆడాల్సి ఉంది. కానీ.. రెండు దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్త పరిస్థితులున్న నేపథ్యంలో అది వాయిదా పడింది. దీంతో భారత జట్టు శ్రీలంకతో అయిదు టీ20లు ఆడనుంది. ఈ మేరకు శ్రీలంకతో టీ 20 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను శుక్రవారం బీసీసీఐ విడుదల చేసింది.

విశాఖ, తిరువనంతపురం వేదికలుగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. 2026లో జరిగే మహిళల టీ 20 వరల్డ్‌కప్‌నకు ఈ సిరీస్ తొలి సన్నాహకంగా భావిస్తున్నారు. 2024లో జరిగిన మహిళల టీ 20 వరల్డ్‌కప్‌లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయిన తర్వాత భారత జట్టు తొలి దశలోనే నిష్క్రమించింది.

అనంతరం హర్మన్ ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు వెస్టిండీస్ (2-1), ఇంగ్లాండ్ (3-2)తో జరిగిన సిరీస్‌లను కైవసం చేసుకుంది. టీ20 ప్రపంచ కప్ 2026కు ముందు భారతజట్టు ఆస్ట్రేలియాలో (ఫిబ్రవరి 2026), ఇంగ్లాండ్‌లో (మే 2026) తలపడనుంది. స్వదేశంలో వన్డే ప్రపంచ కప్ విజయం తర్వాత టీమ్ ఇండియా మీద ప్రస్తుతం అంచనాలు పెరిగాయి.

**ఇండియా - శ్రీలంక టీ20 సిరీస్ షెడ్యూల్**

*ఆదివారం - 21 డిసెంబర్ - మొదటి టీ20 - విశాఖపట్నం*
*మంగళవారం - 23 డిసెంబర్ రెండో టీ20 - విశాఖపట్నం*
*శుక్రవారం - 26 డిసెంబర్ మూడో టీ20 - తిరువనంతపురం*
*ఆదివారం - 28 డిసెంబర్ నాలుగో టీ20 తిరువనంతపురం*
*మంగళవారం - 30 డిసెంబర్ అయిదో టీ20 తిరువనంతపురం*




# అరుదైన రికార్డు ముంగిట రోహిత్, కోహ్లి




టీమిండియా దాదాపు 25 సంవత్సరాల అనంతరం తొలిసారిగా స్వదేశంలో సౌతాఫ్రికా చేతిలో టెస్టు సిరీస్‌ను కోల్పోయిన నేపథ్యంలో నవంబర్ 30 నుంచి ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి చేరికతో వన్డే జట్టు బలంగా కనిపిస్తోంది. వన్డే సిరీస్ గెలిచి, టెస్టు సిరీస్ ఓటమి బాధ నుంచి బయటపడాలని టీమ్ ఇండియా అభిమానులు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ముందు ఓ గొప్ప మైలురాయి ఉంది! వీరిద్దరూ రాంచీ వన్డేలో క్రీజులో నిలబడితే చాలు.. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రావిడ్ రికార్డ్ బద్దలవుతుంది! టీమిండియా క్రికెట్ చరిత్రలో రోహిత్ శర్మ, కోహ్లి జోడీకి మంచి క్రేజ్ ఉంది. వీరు ఎన్నో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పారు. ఎన్నో మ్యాచులను గెలిపించారు. వీరిద్దరూ జోడీగా టీమ్ ఇండియా తరఫున 391 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడారు. సచిన్, ద్రావిడ్ కూడా సరిగ్గా ఇన్నే అంతర్జాతీయ మ్యాచ్‌లు జోడీగా ఆడారు. రాంచీ వన్డేతో రోహిత్, కోహ్లి జోడీగా ఆడిన అంతర్జాతీయ మ్యాచ్‌ల సంఖ్య 392 అవుతుంది. భారత జట్టు పరంగా ఇది రికార్డు. మరే విజయవంతమైన జోడీ కూడా ఇన్ని మ్యాచ్‌లు ఆడలేదు. అలాగే విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా ఇప్పటి వరకు టీమ్ ఇండియా తరపున 309 అంతర్జాతీయ మ్యాచుల్లో జోడీగా ఆడారు.

భారత్, దక్షిణాఫ్రికా జట్లు 1991 నుంచి ఇప్పటి వరకు 94 వన్డేల్లో ముఖాముఖి తలపడ్డాయి. ఇందులో భారత్ 40 మ్యాచుల్లో విజయం సాధిస్తే, సఫారీల జట్టు 51 మ్యాచుల్లో గెలిచింది. వీటిలో భారత్ స్వదేశంలో 18, తటస్థ వేదికపై 10 మ్యాచుల్లో నెగ్గింది. దక్షిణాఫ్రికా స్వదేశంలో 26, తటస్థ వేదికల్లో 11 మ్యాచ్లు నెగ్గింది.

**ముమ్మరంగా ప్రాక్టీస్**

రాంచీ వేదికగా నవంబర్ 30న జరిగే తొలి వన్డే మ్యాచ్ కోసం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి నెట్స్‌లో ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తూ కనిపించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టెస్ట్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయపడి జట్టుకు దూరమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అతడి గైర్హాజరీలో కేఎల్ రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

# చెలరేగిన పృథ్వీషా



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా కోల్‌కతా వేదికగా శుక్రవారం హైదరాబాద్ జరిగిన మ్యాచ్‌లో పృథ్వీషా మహారాష్ట్ర తరపున అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 23 బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. ఐపీఎల్ 2026 ఆక్షన్‌కు ముందు పృథ్వీషా చేసిన ఈ ప్రదర్శన ప్రాధాన్యం సంతరించుకుంది. అతడు ఈ మ్యాచ్‌లో 36 బంతుల్లో మూడు సిక్సులు, తొమ్మిది ఫోర్ల సాయంతో 66 పరుగులు చేశాడు. అర్షిన్ కులకర్ణితో కలిసి అతడు తొలి వికెట్‌కు 73 బంతుల్లో 117 పరుగుల భాగస్వామ్యాన్ని జత చేశాడు. అంతకు ముందు తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 191 రన్స్ చేసింది. అనంతరం మహారాష్ట్ర జట్టు 18.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. దీంతో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పృథ్వీ క్రీజులోకి వచ్చినప్పటి నుంచే దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు. అతడి పరుగుల్లో ఆఫ్‌సైడ్‌లో 47 శాతం, లెగ్‌సైడ్‌లో 53 శాతం సాధించటం గమనార్హం. పృథ్వీషా కొంతకాలం క్రితం ముంబయి నుంచి మహారాష్ట్ర జట్టుకు మారిన విషయం తెలిసిందే.

# ఆర్సీబీ దారిలోనే ఆర్ఆర్




ఐపీఎల్ ఫ్రాంచైజీల్లో ఇప్పటికే రాయల్స్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) అమ్మకానికి కాగా.. రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) కూడా అదే దారిలో ఉంది. ఐపీఎల్‌లో ప్రతి ఏడాది జట్ల నుంచి ఆటగాళ్లు మారుతూ ఉంటారు.. కానీ ఈ సారి జట్ల ఫ్రాంచైజీలే చేతులు మారనున్నాయి. ఈ ఏడాది ఐపీఎల్ విజేత రాయల్స్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)ను అమ్మకానికి పెట్టిన విషయం తెలిసిందే. తాజాగా రాజస్థాన్ రాయల్స్(ఆర్ఆర్) జట్టు కూడా చేతులు మారనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష గోయెంకా చేసిన పోస్ట్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకటి కాదు.. రెండు ఐపీఎల్ జట్లు అమ్మకానికి ఉన్నట్లు తెలిసింది. అవే ఆర్సీబీ, ఆర్ఆర్. వీటిని దక్కించుకునేందుకు ఐదుగురు కొనుగోలుదారులు పోటీ పడుతున్నారు. వారిలో ఈ ఫ్రాంచైజీలు ఎవరికి దక్కనున్నాయో! పుణె, అహ్మదాబాద్, ముంబై, బెంగళూరు, యూఎస్ఏ.. కొత్త యజమానులు ఎక్కడి నుంచి వస్తారో..?' అని హర్ష గోయెంకా తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో ఈ పోస్ట్ వైరల్ అయింది. ప్రస్తుతం ఆర్ఆర్.. రాయల్స్ స్పోర్ట్స్ గ్రూప్ చేతుల్లో ఉంది. ఈ కంపెనీకి ఫ్రాంచైజీలో 65శాతం వాటా ఉంది.

ఇటీవల ఆర్సీబీ యజమాని డియాజియో కంపెనీ ఈ ఫ్రాంఛైజీ విక్రయ ప్రక్రియను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమాచారం ఇచ్చింది. ఆర్సీబీ ఫ్రాంచైజీలో పెట్టుబడి పెట్టే వారి కోసం చూస్తున్నట్లు, వచ్చే ఏడాది మార్చి 31 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కానున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఆర్సీబీ విక్రయం గురించి తొలుత ప్రముఖ పారిశ్రామికవేత్త అదర్ పూనావాలా ఈ ఏడాది అక్టోబరులో హింట్ ఇచ్చారు. పూనావాలాతో పాటు మరో రెండు ప్రముఖ సంస్థలు కలిసి ఆర్సీబీని కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయి.

# హైదరాబాద్‌కు మెస్సీ



ప్రపంచవ్యాప్తంగా కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్న అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ.. హైదరాబాద్ వస్తున్నారు. ఆయన రాక కోసం లక్షలాది ఫుట్‌బాల్ అభిమానులు ఎదురుచూస్తుండగా తాను హైదరాబాద్ వస్తున్నట్లు మెస్సీ స్వయంగా సోషల్ మీడియాలో ప్రకటించాడు. మెస్సీ త్వరలో భారత్‌లో పర్యటించనున్న విషయం తెలిసిందే. అయితే ఈ సాకర్ దిగ్గజం డిసెంబర్ 13న హైదరాబాద్‌లో కూడా అడుగు పెట్టనున్నట్లు సోషల్ మీడియా వేదికగా అతడే తెలిపాడు. తన ప్రయాణంలో హైదరాబాద్ కూడా ఉండటం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని పేర్కొన్నాడు. మరికొన్ని రోజుల్లో ఇండియాకు నా ప్రయాణం ప్రారంభం కానుంది. నా పై ఇండియా చూపిస్తున్న ప్రేమకు ధన్యవాదాలు. నా ప్రయాణంలో హైదరాబాద్ కూడా ఉంది. నా విజిట్‌లో ఈ సిటీని జోడించడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని మెస్సీ ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టాడు. కాగా ఈ అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ హైదరాబాద్‌తో పాటు కోల్‌కతా, ముంబై, ఢిల్లీలో పర్యటించనున్నాడు. అయితే హైదరాబాద్ పర్యటన తేదీలు ఇంకా ఖరారు కాలేదు.

# ధోనీ ఇంటికి కోహ్లి



విరాట్ కోహ్లి, ఎంఎస్ ధోనీ.. భారత క్రికెట్ చరిత్రలోనే వీరిది ప్రత్యేకస్థానం. వీళ్లు కలిశారంటే ఫ్యాన్స్‌కు పండుగ. ఈ క్రమంలో తాజాగా జార్ఖండ్ రాజధాని రాంచీలోని ధోనీ ఇంటికి కోహ్లీ వెళ్లాడు. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం రాంచీ చేరుకున్న విరాట్‌ను.. ధోనీ తన నివాసంలో విందుకు ఆహ్వానించాడు. ఆ తర్వాత ధోనీనే స్వయంగా తన కారులో కోహ్లిని హోటల్ దగ్గర దిగబెట్టాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో జోరుగా వైరల్ అవుతోంది.

నవంబర్ 30 నుంచి రాంచీ వేదికగా సౌతాఫ్రికాతో టీమిండియా మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. విరాట్ కోహ్లి ఇప్పటికే లండన్ నుంచి ఇండియాకు వచ్చాడు. అతడిని ధోనీ తన ఇంటికి ఆహ్వానించాడు. కోహ్లితో కూడా స్టార్ బ్యాటర్లు రిషభ్ పంత్, రుతురాజ్ గైక్వాడ్ కూడా ధోనీ ఇంటికి వెళ్లారు. మరోవైపు కోహ్లి ఇది కీలక సిరీస్‌గా మారనుంది. గత ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో తొలి రెండు మ్యాచుల్లో విఫలమైన విరాట్.. మూడో వన్డేలో ఫామ్‌లోకి వచ్చాడు. ఆ క్రమంలో సౌతాఫ్రికాతో వన్డేల్లో కూడా కోహ్లి పరుగుల వరద పారించాలని అభిమానులు ఆశిస్తున్నారు.


చైతన్య రథం
సినిమా
శనివారం 29 నవంబర్ 2025


# ఆసక్తికరంగా కార్తి టీజర్



పోలీసు అధికారిగా కార్తి నటిస్తున్న చిత్రం 'వా వాతియార్'. కృతిశెట్టి హీరోయిన్. నలన్ కుమారస్వామి దర్శకుడు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన సినిమా తెలుగులో 'అన్నగారు వస్తారు' టైటిల్‌తో విడుదలవుతోంది. సోషల్ మీడియా వేదికగా టీజర్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. డైలాగ్స్ లేకపోయినా టీజర్ ఆసక్తిగా సాగింది. హీరో పాత్ర ఎలా ఉంటుందన్నది ఈ వీడియో ద్వారా చెప్పే ప్రయత్నం చేశారు.

# నిజంగానే కొడుకైపోయాడు!



నటుడు అడివి శేష్ -26/11 దాడుల్లో వీరమరణం పొందిన మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ జీవితం ఆధారంగా 'మేజర్' సినిమా చేసిన సంగతి తెలిసిందే. ఆ సినిమా చేసినపుడు మేజర్ తల్లిదండ్రులకు ఎప్పటికీ కుమారుడిలా ఉంటానని మాటిచ్చారు. మూడేళ్లుగా ప్రతి ఏడాదీ నవంబర్ 26న మేజర్ కుటుంబాన్ని కలుస్తున్నారు. ఒకవిధంగా నిజంగానే మేజర్ తల్లిదండ్రులకు కొడుకైపోయాడు. ఈ ఏడాదీ మేజర్ తల్లిదండ్రులను కలిసి.. ముంబయిలోని స్మారకచిహ్నం వద్ద మేజర్‌కు నివాళు లర్పించాడు అడవి శేష్. "మేజర్ జ్ఞాపకాలను ఎప్పటికీ మర్చిపోకూడదని అనుకున్నాం. మా అమ్మ, అంకుల్‌కు కూడా ఇదే ప్రమాణం చేశా. నేను ఏ సినిమా చేస్తున్నా.. వీరితో అనుబంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నాను. వీరితో నేను ఉంటున్నానంటే మేజర్ జ్ఞాపకాలు సజీవంగా ఉన్నట్లే. మన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను ఎప్పటికీ మర్చిపోకూడదు" అని అడివిశేష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించి.. ఫ్యాన్స్ మనసులు గెలుచుకున్నాడు. మేజర్ తల్లిదండ్రులతో దిగిన ఫొటోలను పంచుకున్నారు. వీటిని చూసినవారంతా అడివి శేష్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం అడివిశేష్ 'డెకాయిట్' సినిమా చేస్తున్నాడు. ఈ రొమాంటిక్ యాక్షన్ మూవీకి షానీల్దియో దర్శకుడు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్. వచ్చే ఏడాది మార్చి 19న సినిమా విడుదల కానుంది.

# అది సరదా కోసమంతే!



'పెళ్లికి ఎక్స్‌పైరీ డేట్ ఉంటే ఎక్కువ కాలం బాధపడాల్సిన అవసరం ఉండదు' అన్న కాజోల్ సరదాగా చేసిన వ్యాఖ్యలు విమర్శ లకు దారితీయడం తెలిసిందే. 'టూమచ్' షో తాజా ఎపిసోడ్‌లో ఈ విషయం చర్చకి రావడంతో కాజోల్ స్పందిస్తూ.. 'దయచేసి సరదా సంభాషణల్లో భాగంగా చేసే వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోకండి' అన్నారు. దీనికి ట్వింకిల్ రియాక్ట్ అవుతూ.. 'ఈ కార్యక్రమంలో మాట్లాడే వాటిని సీరియస్‌గా తీసుకోవద్దు అని మనం మొదటి ఎపిసోడ్ నుంచే డిస్‌క్లైమర్ ఇస్తున్నాం. మళ్లీ చెబుతున్నాం.. మేం చెప్పే సలహాలు పాటించకండి" అన్నారు. బాలీవుడ్ తారలు కాజోల్, ట్వింకిల్ ఖన్నా వ్యాఖ్యాతలుగా సిద్ధమైన సెలబ్రిటీ టాక్ షో 'టూ మచ్'. ఓటీటీ 'అమెజాన్ ప్రైమ్ వీడియో' వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఇటీవల కార్యక్రమానికి విక్కీ కౌశల్, కృతిసనన్ వచ్చి సందడి చేశారు. పెళ్లికి ఎక్స్‌పైరీ తేదీ, రెన్యువల్ ఆప్షన్ ఉండాలా? వద్దా? అన్న ప్రశ్న వచ్చింది. ఇందుకు ట్వింకిల్ ఖన్నా స్పందిస్తూ, 'అది పెళ్లి. వాషింగ్ మెషీన్ కాదు' అని సమాధాన మిచ్చారు. అక్కడే ఉన్న కాజోల్ స్పందిస్తూ 'నేను కూడా అలాగే అనుకుంటున్నా. కానీ, రెన్యువల్ చేసుకునే అవకాశం ఉంటే మంచిదని నా అభిప్రాయం. ఇక ఎక్స్‌పైరీ డేట్ ఉంటే ఎవరూ ఎక్కువకాలంపాటు బాధ పడాల్సిన అవసరం ఉండదు' అని కాజోల్ వ్యాఖ్యానించారు.

# ఏమైంది బాసూ నీకు..?



లోకేష్ కనగరాజ్ నుంచి రీసెంట్‌గా 'కూలీ' వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమా తర్వాత కమల్ హాసన్, రజనీకాంత్‌ల క్రేజీ మల్టీస్టారర్ చేస్తాడన్న టాక్ వచ్చింది. కానీ అప్పటికే కూలీ ఫేజ్‌లో చేయాల్సివున్న ఖైదీ-2 పెండింగ్‌లో ఉండిపోయింది. తరువాత -రజిని, కమల్ మల్టీస్టారర్ దర్శకుడిని తాను కాదంటూ చెప్పుకున్నాడు కనగరాజ్. దీంతో -ఖైదీ ఫ్యాన్స్, తమిళ ఆడియెన్స్ చాలామంది ఫైనల్‌గా ఖైదీ-2 స్టార్టవుతుందని అనుకున్నారు. కానీ లేటెస్ట్ ట్విస్ట్‌గా లోకేష్ లైనప్‌లో మళ్లీ ఖైదీ-2 వెనక్కి వెళ్లనుందన్న రూమర్స్ తమిళ ఆడియెన్స్‌ని అసహనానికి గురి చేస్తున్నాయి. ఎప్పుడో కంప్లీట్ చేయాల్సిన ఖైదీ-2 ముందు పూర్తి చేసుకుంటే బాగుంటుందని.. తననుంచి ఏం ఆశిస్తున్నారో ఆడియెన్స్ సోషల్ మీడియాలో ఎక్స్‌ప్రెస్ చేస్తున్నారు. తన సినిమాటిక్ యూనివర్స్‌లో మంచి క్రేజ్‌వున్న సినిమాలు వదిలేసి వేరే సినిమాలు చేస్తాడనే టాక్‌కే వారు ఇప్పుడు డిజప్పాయింట్ అవుతున్నారు. మరి వీటిని లోకేష్ ఎలా తీసుకుంటాడో చూడాలి.

# ఓటీటీకి వచ్చేశారు..



మాస్ మహారాజ రవితేజ హీరోగా హీరోయిన్ శ్రీలీల కాంబినేషన్‌లో దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కించిన చిత్రమే "మాస్ జాతర". రవితేజనుంచి మంచి కంబ్యాక్‌గా నిలుస్తుంది అనుకున్న సినిమా కూడా అభిమానులకి ఒకింత నిరాశనే మిగిల్చింది. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం బాగానే రన్నయిన సినిమా.. ఫైనల్‌గా ఓటీటీలో స్ట్రీమింగ్‌కి వచ్చేసింది. నెట్ ఫ్లిక్స్ ప్లాట్ ఫామ్‌లో నేటినుంచి సినిమా అందుబాటులోకి వచ్చింది. ఈ సినిమాకి భీమ్స్ సంగీతం అందించగా సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ అలాగే శ్రీకర సంయుక్తంగా నిర్మించారు.

రీసెంట్‌గా కోలీవుడ్ సినిమానుంచి వచ్చిన పలు ఇంట్రెస్టింగ్ చిత్రాల్లో నటుడు కార్తీక్ ఆర్యన్ నటించిన మరో క్రైమ్ థ్రిల్లర్ -"ఆర్యన్". దర్శకుడు ప్రవీణ్ కె తెరకెక్కించగా తమిళ్‌లో మంచి హిట్టయ్యింది. అయితే ఈ సినిమా ఇపుడు మూడు వారాల్లోనే ఓటీటీలోకి వచ్చేసింది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోగా.. అందులో ఈ సినిమా నేటినుంచి స్ట్రీమింగ్ అవుతుంది. తెలుగులో ఓ మోస్తరు టాక్ తెచ్చుకున్న ఈ సినిమా ఈరోజునుంచి తెలుగు, తమిళ్ సహ హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమవుతుంది. సో ఈ క్రేజీ క్రైమ్ థ్రిల్లర్‌ని థియేటర్లలో మిస్సైన వాళ్లు ఇప్పుడు నెట్ ఫ్లిక్స్‌లో ఎంజాయ్ చేయొచ్చు. ఇక ఈ సినిమాలో శ్రద్ధాశ్రీనాథ్, మానస చౌదరి అలాగే సెల్వ రాఘవన్‌లు కీలక పాత్రల్లో నటించగా ఘిబ్రాన్ సంగీతం అందించాడు.

# కుట్టిని.. మమ్ముట్టినయ్యాను



అగ్ర కథానాయకుడు మమ్ముట్టి అసలు పేరు మహమ్మద్ కుట్టి అనే విషయం తెలిసిందే. తాజాగా ఆయన తన పేరు మమ్ముట్టిగా ఎలా మారిందో వివరించారు. తన పేరు మార్చిన స్నేహితుడిని పరిచయం చేశారు. కేరళలో జరిగిన ఒక కార్యక్రమంలో కాలేజీ రోజుల్లో జరిగిన సరదా సన్నివేశాన్ని పంచుకున్నారు. "నేను కాలేజీలో ఉన్నప్పుడు అందరితో నా పేరును ఒమర్ షరీఫ్ (ప్రముఖ నటుడు) అని చెప్పేవాడిని. నా అసలు పేరు మహమ్మద్ కుట్టి అని కాలేజీలో ఎవరికీ తెలియదు. ఒకరోజు నా ఐడీ కార్డు మర్చిపోయాను. దాంతో నా పేరు అందరికీ తెలిసిపోయింది. నా స్నేహితుల్లో ఒకరు నీ పేరు షరీఫ్ కాదు మమ్ముట్టి అన్నారు. (మహమ్మద్ కుట్టిని పొరపాటున మమ్ముట్టి అని చదివారు). దీంతో అప్పటినుంచి నా పేరు మమ్ముట్టిగా మారిపోయింది" అని ఆ స్నేహితుడిని పరిచయం చేశారు. అతడి పేరు శశిధరన్ అని తెలిపారు. తన పేరు ఎలా మారిందని పేపర్లో ఎన్నో వార్తలు వచ్చాయని మమ్ముట్టి గుర్తు చేసుకున్నారు. కానీ, ఆ పేరు వెనక ఉన్న అసలు కథ ఇదేనని చెప్పారు. ఇన్ని రోజులు తన స్నేహితుడి గురించి చెప్పకుండా రహస్యంగా ఉంచానన్నారు. దీంతో ఎన్నో రోజులుగా వస్తోన్న ఊహాగానాలకు చెక్ పడింది. 1971లో ఇండస్ట్రీలోకి వచ్చిన మమ్ముట్టి ఇప్పటివరకు 420 చిత్రాలకు పైగా నటించారు. ప్రస్తుతం 'కళంకావల్' అనే చిత్రంలో నటిస్తున్నారు. జితిన్ దర్శకత్వంలో క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది.



## నా కొడుకుమీద అంత పగెందుకు?

పృథ్వీరాజ్ సుకుమారన్ కెరీర్‌ను అంతం చేయాలని కొందరు భావిస్తున్నారంటూ తల్లి మల్లిక సంచలన వ్యాఖ్యలు చేశారు. అతడిని ఇండస్ట్రీ నుంచి పంపించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఆయన తాజా చిత్రం 'విలాయత్ బుద్ధ' విషయంలోనూ తన కుమారుడిని టార్గెట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. "పృథ్వీరాజ్‌పై కొన్ని దాడులు జరిగినప్పుడు అతడికి మద్దతు ఇవ్వడానికి తక్కువమంది ముందుకొచ్చారు. ఇప్పుడూ ఆన్‌లైన్ వేదికగా అతడిని దుర్భాషలాడుతున్నారు. పృథ్వీని టార్గెట్ చేస్తూ దాడికి దిగుతున్నారు. కెరీర్‌లో ఎదగడాన్ని జీర్ణించుకోలేక.. నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇంత నీచానికి దిగజారుతారని అనుకోలేదు. ఇలాంటి పనులు ఆపకపోతే నేను సందర్భం వచ్చినప్పుడల్లా దీనిపై పోరాడుతూనే ఉంటాను" అని మల్లిక ఆవేదన వ్యక్తంచేశారు.

పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'విలాయత్ బుద్ధ'. జయన్ నంబియార్ దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కింది. ఈ సినిమానుంచే పృథ్వీపై ఆన్‌లైన్ వేదికగా కొందరు ట్రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా 'పుష్ప'ను పోలి ఉందంటూ పోస్టు పెట్టారు. ఇక ప్రస్తుతం పృథ్వీరాజ్ 'వారణాసి'లో నటిస్తున్నారు. మహేశ్ బాబు హీరోగా అగ్ర దర్శకుడు రాజమౌళి తెరకెక్కిస్తోన్న భారీ ప్రాజెక్టులో 'కుంభ' పాత్రతో విలన్‌గా కనిపించనున్నారు.